



సత్యవాడలో శానిటేషన్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు



7

పిల్లల కళ్లెదుటే!

పెదనాన్న ఇంటికి వెళుతున్నామని .. ఆ చిన్నారులు ఎంతో ఆనందంగా ఉన్నారు.. ఇంటి నుంచి బండిపై బయలుదేరింది మొదలు అమ్మా నాన్నతో కబుర్లు చెబుతూనే ఉన్నారు.. అవే చివరి మాటలు అవుతాయని.. అదే అమ్మానాన్నతో చివరి ప్రయాణం అవుతుందని ఆ చిన్నారులకు తెలియదు పాపం.. అందుకే బైక్‌పై వెళుతుండగానే టాయిలెట్ వస్తుందని నాన్నతో చెప్పారు.. అంతే బండి రోడ్డు పక్కగా ఆపి అక్కకు తమ్ముడిని తోడుగా పంపారు.. అలా వెళ్లి తిరిగి చూసేసరికి లారీ రూపంలో మృత్యువు కబళించడంతో అప్పటి వరకూ తమతో ఉన్న అమ్మానాన్న అనంతలోకాల్లో కలిసిపోయారు.. ఇది చూసిన ఇద్దరు చిన్నారుల నోట మాటలేదు.. అమ్మా నాన్నా కావాలంటూ కన్నీళ్లు తప్ప..!



కరోనా.. హైరానా!

తొలి కేసు నమోదుతో అంతటా ఆందోళన

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మళ్లీ కొవిడ్ వైరస్ జాడలు వెలుగు చూస్తున్నాయి. దేశ రాజధానితో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో కొవిడ్ వైరస్ కేసులు నమోదవుతున్నాయి. ఏపీ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరేట్ ఇటీవల కొవిడ్ అప్రమత్తతపై ప్రజలు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ ఉత్తర్వులిచ్చిం ది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులతో కొందరు జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. మళ్లీ కొవిడ్ వ్యాప్తిచెందుతోందన్న వార్తలతో ఏవైనా లక్షణాలు కనిపిస్తే ప్రజలు వెంటనే అప్రమత్తం అవుతున్నారు.ఇప్పటికే కొందరు మాస్కులు పెట్టుకుని తిరుగుతున్నారు. కాగా ప్రార్థనా సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీల కార్యక్రమాలు వంటి సామూహిక సమావేశాలను నిలిపివేయాలని హెల్త్ డిపార్టుమెంట్ సైతం ఆదేశించింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో కొవిడ్ 19 జాగ్రత్తలు పాటించాలని వృద్ధులు, గర్భిణులు ఖచ్చితంగా కొవిడ్ జాగ్రత్తలు తీసుకుంటూ ఇళ్లకే పరిమితం కావాల్సిందిగా సూచించారు. మాస్కులు ధరించాలని సూచించారు. కొవిడ్ 19 లక్షణాలు ఉంటే ముందుగా పరీక్ష చేయించుకుని ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలు పాటించాలని సూచించారు. ఆరోగ్యశాఖ అన్ని పరీక్షా సౌకర్యాలతో కూడిన ల్యాబ్‌లు, మాస్కులు, పీపీఈ కిట్లు, ట్రిపుల్ లేయర్ మాస్కులు తగినంత పరిణామంలో ఆసుపత్రిలో సిద్ధం చేసుకోవాల్సిందిగా సూచనలు చేశారు. కాకినాడ, రాజమహేంద్రవరంలలోని జీజీహెచ్‌లలో ప్రత్యేక వార్డులను ఏర్పాటుచేశారు.కోనసీమ జిల్లా సత్యవాడలో కొవిడ్ కేసు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తం అయ్యారు. జలుబు, జ్వరం ఉన్నవారంతా ఆందోళన చెందుతున్నారు.

- అప్రమత్తమైన అధికారులు
- జిల్లా ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డులు

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో కొవిడ్ ఐసోలేషన్ వార్డు

రాజమహేంద్రవరం అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. సోమవారం నాటికి వార్డు సిద్ధం కావొచ్చని చెబుతున్నారు. ముందుగా 15 బెడ్స్‌తో ఐసోలేషన్ వార్డును సిద్ధం చేసి, అవసరమైతే మరో 15 బెడ్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. పాత మలేరియా అధికారి కార్యాలయం నిర్వహించిన రేకులషెడ్డును కొవిడ్ ఐసోలేషన్ వార్డుగా మార్చాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం షెడ్డులో ఉన్న సామాగ్రిని తరలించే కార్యక్రమం చేపట్టారు. బెడ్స్, ఆక్సిజన్, ఇతర వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేసి అందుబాటులోకి తెస్తారు.



సత్యవాడలో వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కోనసీమలో తొలి కేసు..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడకు చెందిన వృద్ధుడికి గత మూడు రోజులుగా లోఫీవర్, నిరంతరంగా ముక్కు కారడం వంటి సమస్యలతో బాధపడుతుండడంతో కుటుంబీకులు శుక్రవారం రాత్రి ద్రాక్షారామలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు కొవిడ్ ర్యాపిడ్ కిట్ పరీక్ష నిర్వహించి పాజిటివ్‌గా గుర్తించారు. అనంతరం అతడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు.కుటుంబీకులు శనివారం జీజీహెచ్‌కు తరలించగా అతని స్వాబ్ శాంపిల్‌తో ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేసి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారించారు.అనంతరం అతన్ని ఈఎస్‌టీ విభాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొవిడ్ వార్డుకు తరలించి చికిత్సను అందజేస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ వెల్లడించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోనే ఈ ఏడాది ఇదే తొలి కేసు కావడంతో వైద్య వర్గాలన్నీ అప్రమత్తం అయ్యాయి.

ఆందోళన వద్దు.. అప్రమత్తత అవసరం



కొవిడ్‌తో ఆందోళన వద్దు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సత్యవాడకు చెందిన వృద్ధుడికి కొవిడ్ పాజిటివ్ రావడంపై మంత్రి స్పందించా రు. పాజిటివ్ వచ్చిన వ్యక్తికి తేలికపాటి లక్షణాలు మాత్రమే ఉన్నా యి. జిల్లా వైద్యశాఖ అధికారులు, కాకినాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదు.. ధైర్యంగా ఉండాలి. కరోనా లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకుని తగిన వైద్యసేవలు పొందాలి. - **వాసంశెట్టి సుభాష్, మంత్రి**

అక్రమాలు.. తవ్వేస్తారు!



నాడు సెల్ఫీ తీసుకున్నారు... నేడు లెక్క తీస్తారు :

ఆగస్టు 17 2023న జొన్నాడలో ఇసుక గుట్టల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న చంద్రబాబు(ఫైల్)

ఇసుకాసురుల్లో 'సిట్' గుబులు

ఇక ఇసుక అక్రమాల వంతు వచ్చింది.. గత వైసీపీ హయాంలో లెక్కలను తవ్వనున్నారు.. నాడు వంద కోట్ల రూపాయల విలువైన ఇసుకను దోపిడీ చేసిన కీలక నేతల గుండెల్లో గుబులు రేగుతోంది.రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమాలపై సిట్'ను ఏర్పాటు చేస్తూ తీసుకున్న నిర్ణయం గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డ ఇసుక మాఫియా అక్రమాలు వెలుగు చూస్తాయనే ఆందోళన అప్పుడే ప్రారంభమైంది.. నాడు ప్రతిపక్ష నాయకుడి హోదాలో జిల్లా పర్యటనకు హాజరైన చంద్రబాబు ఆలమూరు మండలం జొన్నాడ వద్ద సెల్ఫీ చాలెంజ్ విసిరారు. ఇప్పుడు సీఎం హోదాలో ఆ అక్రమాలను వెలికితీసే పనిలోపడ్డారు..

- వైసీపీలో ఇసుక దోపిడీపై దర్యాప్తు
- వందల కోట్ల ఇసుక తరలింపు
- ప్రేమ్‌రాజ్ బలవన్మరణంపై ఆరా
- సుప్రీం కోర్టుకు తప్పుడు నివేదిక
- డ్రెడ్జింగ్ మతలబుపైనా కన్ను
- యథేచ్ఛగా సాగిన అక్రమాలు
- ఇష్టానుసారంగా అనుమతులు
- నాడు సహకరించిన అధికారులు

(రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో గోదావరిలో జరిగిన ఇసుక దోపిడీపై సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో అప్పటి సర్కారీ పెద్దలతో పాటు ఇసుక దోపిడీలో భాగమైన అధికార, అనధికారుల వెన్నులో వణుకు మొదలైంది. కొవ్వూరు, నిడదవోలు, రాజ మహేంద్రవరం, రూరల్, రాజానగరం, రామచంద్రపురం, మండపేట, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని ర్యాంపుల నుంచి ఐదేళ్ల కాలంలో వందల కోట్లు విలువైన ఖనిజ సంపద దోచుకుపోయారు. నాడు ఏపీఎండీసీకి అప్పగించినట్టే అప్పగించి వేల కోట్లు దోచుకున్నారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా వందల కోట్ల రూపాయల ఇసుక అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది.నాడు జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల్లో లభ్యమయ్యే వందల కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా దోచేశారు.

దోపిడీ సాగిందిలా..

ఇసుకలో వైసీపీ దోపిడీ అంతా ఇంతా కాదు.. గోదావరిని జోన్-2, జోన్-3 కింద విభజించి మొదట జేపీ వెంచర్స్‌కు రెండేళ్లకు కాంట్రాక్టు ఇచ్చారు. ఈ సంస్థ ఆన్‌లైన్ లావాదేవీలు చేయకుండా ఒకే ఒక్క బిల్లు బుక్ పట్టుకుని అక్రమంగా లక్షలాది టన్నుల ఇసుకను తరలిం చేసింది. 2023 మే నెలలో ఈ సంస్థ కాంట్రాక్టు ముగియడంతో వారిని పక్కన పెట్టి అప్పటి వైసీపీ సర్కారీ పెద్దలు తెరమీదకు వచ్చారు. జేపీ సంస్థ వాడిన బిల్లులనే చూపిస్తూ అనధికారికంగా మరింత బరితెగించిన సంగతి తెలిసిందే. వీరు ఏకంగా ర్యాంపులన్నింటికీ ఒకే వ్యక్తికి అప్పగించి నెలకు సుమారు రూ.30 కోట్ల వరకూ చెల్లించేలా ఒప్పందం పెట్టుకున్నారు. ఇసుక తవ్వకముందే వారికి డబ్బు ఇచ్చేటట్టు లోపాయికార ఒప్పందం జరిగింది. కొవ్వూరు డివిజన్‌లోని ర్యాంపులను కొవ్వూరుకు చెందిన వైసీపీ నేత ప్రేమ్‌రాజ్ దక్కించుకుని అప్పుల పాలయ్యాడు. అనంతరం ప్రేమ్‌రాజ్ కొవ్వూరులో రైల్వే పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తి చేయనీయలేదు. తాడేపల్లి నుంచి కొందరు పెద్దలు పంపిన వ్యక్తులు వచ్చి ప్రేమ్‌రాజ్ కేసును మూయించేసినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. ఇవాళ సిట్‌ని నియమించడంతో ఈ కేసును పూర్తిగా దర్యాప్తు చేస్తే ఇసుక కుంభకోణాల డొంక కదలకతప్పదు. రాజమహేంద్రవరం వైపు ఆర్‌కే అనే వ్యక్తి మొత్తం ర్యాంపులను తీసుకుని సర్కారుకు కప్పం చెల్లించిన సంగతి తెలిసిందే. ఇందులో కొన్ని కుంభ కోణాలు కోర్టు వరకూ వెళ్లడంతో సుప్రీంకోర్టు విచారణకు ఆదేశించింది. దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్‌తో కూడా తప్పుడు రిపోర్టు ఇప్పించినట్టు ప్రచారం జరిగింది. గోదావరిలో అక్రమాలపై ధవళేశ్వరం గ్రామానికి చెందిన వంశీ అనే ఇసుక వ్యాపారి కోర్టును ఆశ్రయించడంతో ఎస్పీ ఆఫీసుకు అతన్ని పిలిపించి అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు చుట్టుముట్టి అతని చేత బలవంతంగా ఫిర్యాదు వెనక్కి తీయించడం అప్పట్లో సంచలన మైంది.ఇదంతా తాడేపల్లి పెద్దల ఒత్తిడితోనే జ రిగినట్టు ప్రచారం జరిగింది.

నాడు చంద్రబాబు సెల్ఫీ చాలెంజ్

ఆగస్టు 17 2023లో జొన్నాడలో ఉన్న ఇసుక గుట్టలను చంద్రబాబు నాయుడు సందర్శించారు.కోనసీమ జిల్లా పర్యటనలో భాగంగా అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల పేర్లను ప్రస్తావిస్తూ ఇసుక దోపిడీలో ఎన్ని వందల కోట్లు దోచుకున్నారో లెక్కలతో సహా ఆరోపణాస్త్రాలు సంధించారు.అప్పటి వైసీపీ ప్రభుత్వానికి సెల్ఫీ చాలెంజ్ చేశారు.ఇసుక దోపిడీలో నాటి ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కీలక పాత్ర వహించినట్టు తేల్చారు.ఇప్పుడు సీఎం హోదాలో లెక్క తేల్చనున్నారు.

కోర్టును తప్పుదారి పట్టించి..

ఇసుక కుంభకోణాలు, అక్రమాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇక్కడ అసలు డ్రెడ్జింగ్ అక్రమాలు జరగలేదని, నిబంధనలు ఎవరూ ధిక్కరించలేదని ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంస్థ పేరునే డ్రెడ్జింగ్ జరిగినట్టు ఓ బూటకపు నాటకాన్ని తెరమీదకు తేవడం కూడా చాలా మందికి తెలిసే ఉంటుంది. అప్పట్లో ధవళేశ్వరం బ్యారేజి నుంచి కాతేరు శివారు వెంకటనగర్ వరకూ,కొవ్వూరు డివిజన్ లోనూ రాత్రీ పగలూ అనధికారికంగా డ్రెడ్జింగ్ జరిగిన సంగతి తెలిసిందే.2023 మే నెల నుంచి వందలాది డ్రెడ్జింగ్ పడవలతో ఇసుక దోపిడీ జరిగింది.2023 డిసెంబర్‌లో ప్రతిమ సంస్థ పేరుతో రంగంలోకి దిగి డ్రెడ్జింగ్ చేశారు.దీనిని ప్రక్కదారి పట్టించడానికి గతంలో డ్రెడ్జింగ్‌కు అనుమతి పొందినా ఇసుక తీయని సంస్థను తెరమీదకు తెచ్చి నాటకాలాడారు. ఇందులో బోట్స్‌మన్ సొసైటీలను భాగస్వామ్యం చేశారు. ఇలా కోర్టును తప్పుదారి పట్టించడమే కాకుండా రూ.వందల కోట్లు బిల్లులు ఇవ్వాలని తర్వాత ప్రభుత్వానికి బిల్లులు పెట్టడం గమనార్హం. దీనికి అప్పటి మైన్స్,ఇరిగేషన్ అధికారులు సహకరించడం,జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తేవడం అందరికీ తెలిసిందే.నాడు బ్రిడ్జిల పక్కనా తవ్వేశారు.ధవళేశ్వరం బ్యారేజి, రోడ్ కం రైలు బ్రిడ్జి, గామన్ వంతెన, హేవలాక్ బ్రిడ్జి ప్రాంతాల్లోనూ యథేచ్ఛగా తవ్వేశారు.గనులు, భూగర్భశాఖకు చెందిన యంత్రాంగం అప్పటి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే పనిచేసింది. మైన్స్ అధికారులు ఎన్ని అక్రమాలు జరిగినా పట్టించుకోలేదు.

వైసీపీలో సిట్ గుబులు..

ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ జిల్లాల వ్యాప్తంగా ఎక్కడ ఎంత మేర ఇసుక దోపిడీ జరిగింది. నాటి ప్రభుత్వానికి ఎంత ఆదాయం వచ్చిందనే అంశంపై లెక్కలు తేల్చి బాధ్యులను గుర్తించేందుకు పోలీసు అధికారులతో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసింది.ఇదిలా ఉండగా కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి స్వగ్రామమైన గోపాలపురంలో శనివారం వైసీపీ కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో విందు సమావేశాన్ని నిర్వహించారు. సరిగా అదే సమయానికి ఇసుక అక్రమాలపై సిట్ ఏర్పాటు చేశారన్న సమాచారం తెలుసుకున్న కొందరు నాయకులు ప్రాథమికంగా చర్చించుకున్నట్టు తెలిసింది.మొత్తంమీద జిల్లాలో దోపిడీపై సిట్ ఏర్పాటు అన్న సమాచారం అటు అప్పటి వైసీపీ ప్రతినిధులు,అప్పట్లో కీలకంగా పనిచేసిన పలు శాఖల అధికారుల్లో గుబులు రేపుతోంది.





చిగురు మేఘం నాటికలోని ఒక సన్నివేశం..

ఎంపీ పాకా సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి

సమాజ హితమే.. నాటికల అభిమతం

నాటిక పోటీల ముగింపు సభలో ఎంపీ పాకా సత్యనారాయణ

అనపర్తి, మే 24 (ఆంధ్రజ్యోతి) : సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు పుట్టిన నాటికలను పోషించడం కూడా ఒక కళేనని అది నల్లమిల్లి మూలారెడ్డికే దక్కిందని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. అనపర్తి మండలం రామవరంలోని నల్లమిల్లి మూలారెడ్డి కళా పరిషత్ 36వ జాతీయ స్థాయి నాటిక పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. మూలారెడ్డి జడ్పీ పాఠశాల సుబ్బిరెడ్డి కళా మందిరంలో జరిగిన ముగింపు సభలో ఆయన మాట్లాడారు. కళలపై ఉన్న మక్కువతో 36 ఏళ్లుగా పరిషత్ నిర్వహించడం సామాన్య విషయం కాదన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ నల్లమిల్లి కుటుంబానికి కళామతల్లి ఆశీస్సులు మెండుగా ఉంటాయన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ తండ్రి మూలారెడ్డి ఆశయాలను బతికించాలన్న తపనతో రామకృష్ణారెడ్డి పరిషత్‌ను నిరాటంకంగా నడిపించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే, పరిషత్ అధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎటువంటి ఆటంకం కలగకుండా పరిషత్ నిర్వహిస్తామన్నారు. ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి,జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెకర్లు కడలి ఈశ్వరి,తుమ్మల పద్మ, శిల్పి వడయార్, రైస్ మిల్లర్ల జిల్లా అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి, పారిశ్రామికవేత్త మేడపాటి రామలింగారెడ్డి, వైద్యులు తాడి రామగుర్రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిగురు మేఘం

నాటిక ప్రదర్శనలో ఆఖరి రోజైన శనివారం రాత్రి తొమ్మిదవ నాటికగా ప్రదర్శించిన అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం ఆకట్టుకుంది. పల్లెటూరులో పుట్టిన కల్యాణ్ తన పేద తల్లిదండ్రులు కష్టంతో వైద్య విద్యను పూర్తి చేస్తాడు. ఇంతలో పట్టణంలో కార్పొరేట్ ఆసుపత్రి అధినేత ధనుంజయరావు కుమార్తె డాక్టర్ శోభనను పెండ్లాడి పట్టణంలో స్థిరపడతాడు. చివరకు తల్లిదండ్రులను పట్టించుకోలేనంత బిజీగా మారతాడు. చివరకు తన తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడంతో తండ్రి ఆమెను వెంటబెట్టుకుని కొడుకు దగ్గరకు చేరుకుంటాడు. శోభన ఆమె తండ్రి ధనుంజయరావు కల్యాణ్ తల్లిదండ్రులను అక్కడి నుంచి ఊరికి పంపే ప్రయత్నం చేయడంతో భార్యాభర్తల మధ్య వివాదాలు తలెత్తుతాయి. వారి మధ్య వాదనలు జీర్ణించుకోలేని కల్యాణ్ తల్లి గుండె పగిలి మరణిస్తుంది. చివరకు భార్యను, కార్పొరేట్ ఆసుపత్రిని వదలి పల్లెలో పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు తండ్రితో పయనమవడంతో నాటిక ముగుస్తుంది.

ఉత్తమ నాటికలివే..

నాలుగు రోజుల పాటు తొమ్మిది నాటికలు ప్రదర్శించగా చైతన్య కళా భారతి కరీంనగర్ వారు ప్రదర్శించిన చీకటి పువ్వు ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. తెలుగు కళా సమితి విశాఖపట్నం వారు ప్రదర్శించిన నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారి నాన్నా నేనొచ్చేస్తా నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిలవగా శర్వాణీ గిరిజన సాంస్కృతిక సేవా కేంద్రం బోరివంక వారు ప్రదర్శించిన కొత్త పరిమళం నాటిక ఉత్తమ జ్యూరీ బహుమతి గెలుచుకొంది. ఉత్తమ రచన జనరల్ బోగీలు రచయిత పీటీ మాధవ్, ఉత్తమ దర్శకత్వం చీకటిపువ్వు దర్శకుడు ఎం.రమేష్, ఉత్తమ నటుడు పిబీ వరప్రసాద్, ఉత్తమ నటిగా ఎస్.అమృత వర్షిణి ఎంపికైనట్లు న్యాయ నిర్ణేతలు ప్రకటించారు.

యోగాంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు జారీ చేస్తామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టర్‌లో శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యోగా కార్యక్రమంలో పాల్గొనే వారు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.యోగాంధ్ర.ఏపీఇన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జూన్ 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. మే 26 నుంచి 30 వరకు అన్ని ప్రాథమిక స్థాయిల వారికి యోగా ఫర్ ఆల్ గ్రాస్ రూట్స్‌పై అవగాహన కార్యక్రమాలు, పేర్లు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. జూన్ 2 నుంచి 7 వరకు యోగా వారిధి ద్వారా ఐక్యత అంశంగా మండల స్థాయిలో సంఘాలతో కూడిన కార్యక్రమాలు,జూన్ 9 నుంచి 14వ తేదీవరకు యోగా, యువత ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం అనే అంశంపై జిల్లా స్థాయిలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయిలో నిర్వహించే రాష్ట్ర గ్రాండ్ ఫినాలేలో జూన్ 16 నుంచి 18 తేదీ వరకు యోగాంధ్ర - గ్లోబల్ యోగా షోకాస్ అంశంపై ప్రదర్శన నిర్వహిస్తారన్నారు. కళాత్మక యోగా పోటీల విభాగంలో యోగా పాట, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, రోల్ ప్లే విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. నాలెడ్జ్ ఆధారిత పోటీల విభాగంలో యోగా క్విజ్, యోగా పోస్టర్ ఆవిష్కరణ, యోగా నినాదం, యోగా వ్యాసం ,యోగా షార్ట్ ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. జేసీ ఎస్ చిన్నరాముడు పర్యవేక్షిస్తారన్నారు.

మళ్లీ రోడ్డెక్కిన అన్నదాత

నిడదవోలు, మే 24 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత మళ్లీ రోడ్డెక్కాడు.. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, డబ్బులు తమ ఖాతాలకు జమ చేయా లని కొందరు రైతులు డిమాండ్ చేశారు. నిడదవోలు మండలం డి.ముప్పవరం గ్రామంలోని సెంటరులో శనివారం రైతులు భారీ ఎత్తున ధర్నా చేశారు. రైతులు వద్ద నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని గాలికొదిలేసిందన్నారు.తమ వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కొందరు రైతులు భీష్మించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లో ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు..ఈ నెల 7వ తేదీ నుంచి విక్రయించిన ధాన్యానికి సొమ్ములు రావడం లేదని మరి కొందరు రైతులు వాపోయారు. జాయింటు కలెక్టర్ తమ వద్దకు రావాలని డిమాండ్ చేశారు.నిడదవోలు మండలంలో 60 వేల మెట్రిక్ టన్నులు నమోదు చేసుకోగా ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాల ద్వారా 53 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. మిగిలిన 7 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు టార్గెట్ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి నిడదవోలు మండలానికి టార్గెట్ వచ్చేలా చేస్తామని కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖరరావు రైతాంగానికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. సోమవారానికల్లా తమ సమస్యలకు పరిష్కారం లభించకపోతే భారీ ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ధర్నా కారణంగా నిడదవోలు నరసాపురం ప్రధాన మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.



నిడదవోలు మండలం డి.ముప్పవరం సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతాంగం

మిల్క్‌ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆటో

ఆటో డ్రైవర్‌ మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మరణించిన వరప్రసాద్‌కుమార్‌



మిల్క్‌ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆటో

గొల్లప్రోలు, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌ పరిధి 216 జాతీయ రహదారిపై మిల్క్‌ ట్యాంకర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌ మరణించగా, మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌ మేడిది ధర్మేంద్ర వరప్రసాద్‌కుమార్‌(34) అలియాస్‌ నాని, అదే గ్రామానికి చెందిన బి.లోవకుమారి అనే సత్యవతి ఆటోలో పిఠాపురం వస్తున్నారు. గొల్లప్రోలు టోల్‌ప్లాజా దాటిన తర్వాత కత్తిపూడి నుంచి పిఠాపురం వైపు ముందు వెళ్తున్న పాల ట్యాంకర్‌ సడన్‌బ్రేక్‌ వేయడంతో పాటు వెనుకనే వస్తున్న ఆటో ఢీకొంది. ప్రమాదంలో వరప్రసాద్‌ కుమార్‌ మరణించగా, లోవకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్‌.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘మూకుమ్మడి ఆత్మహత్యలకు పాల్పడతాం’



గోర్సలో తమ భూముల జోలికి రావద్దని హెచ్చరిస్తున్న రైతులు

కొత్తపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్స గ్రామంలో సర్వే నెం.121, 122ల్లో సుమారు 24 ఎకరాల భూమిని దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే మూకుమ్మడి ఆత్మహత్యలకు పాల్పడతామని రైతులు హెచ్చరించారు. గోర్సలో సీతారామస్వామి ఆలయ భూములని చెప్తున్న భూములన్నీ తమ పేరునే ఉన్నాయన్నారు. అయితే అవి దేవాలయ భూములంటూ స్వాధీనం చేసుకుంటామని అధికారులు హెచ్చరించడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా ఈ భూములు తమ స్వాధీనంలో ఉన్నాయని, వాటికి పన్నులు కూడా చెల్లిస్తున్నామన్నారు. తమ పేరున ఉన్న భూములను కుమార్తెలకు కట్నకానుకలుగా ఇచ్చి పెళ్లిళ్లు చేశామన్నారు. మిగిలిన భూములపై వచ్చే ఆదాయంతో జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఇప్పుడా భూములను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవాలని చూస్తే ఆత్మహత్యలకు పాల్పడడమే శరణ్యమని వారు హెచ్చరించారు.

గోర్స సీతారామస్వామి ఆలయ భూములను స్వాధీనం చేసుకుంటామని అధికారులు మోసం చేశారని సర్పంచ్‌ రొంగల వీరబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆరోపించారు. సర్వే నెం.121, 122ల్లో గల భూములను శనివారం రైతుల నుంచి స్వాధీనం చేసుకుంటామని దేవదాయ శాఖ అధికారులు గ్రామస్తులు, ప్రజలకు సమాచారం ఇచ్చారన్నారు. ఈ క్రమంలో ఆసుపత్రికి తరలించేం దుకు అంబులెన్స్‌లను సిద్ధం చేశారన్నారు. అయితే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏ అధికారీ గోర్స వచ్చిన దాఖలాలు లేవన్నారు. ఏ సమాచారం ఇవ్వకుండా తమను మోసం చేశారని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మరణించిన సుంకర రాజు

జగ్గంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన సుంకర రాజు(35) 10 ఏళ్లుగా జగ్గంపేటలో నివాసం ఉంటున్నాడు. బాలాజీనగర్‌లో ఓ ఇంట్లో వారం రోజుల నుంచి తాపీ పని చేస్తుండగా శనివారం స్లాబ్‌ నిమిత్తం సెంట్రింగ్‌ వేస్తుండగా వర్షం పడడంతో విద్యుత్‌ షాక్‌ కొట్టడంతో కింద పడిపోయాడు. దీంతో స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రఘునందరావు తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్‌

తని రూరల్‌, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం తలుపులమ్మ లోవ దేవస్థానం పరిసర ప్రాంతాలైన ప్రైవేట్‌ వసతి గృహాలు, సమీప మామిడి తోటల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3800 నగదు స్వాధీన పరుచుకున్నట్టు ఎస్‌ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్టు

తాళ్లరేవు, మే 24 (ఆంధ్రజ్యోతి): యానాం నుంచి మద్యాన్ని అక్రమంగా ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్‌ సీఐ కోటేశ్వర్‌ శనివారం తెలిపారు. డిప్యూటీ కమిషనర్‌ వై.చైతన్యమురళీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎక్సైజ్‌ అధికారులు కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు ఎక్సైజ్‌ చెక్‌ పోస్టు వద్ద జరిపిన దాడుల్లో నలుగురు పట్టుబడ్డారు. వారి నుంచి 2 కార్లు, ఒక మోటారుసైకిల్‌, 50మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్‌ చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్టు సీఐ తెలిపారు. దాడుల్లో సీఐతో పాటు ఎస్‌ఐ నాగేంద్రకృష్ణ తదితరులు ఉన్నారు.

ఈఏపీసెట్‌ ఇంజనీరింగ్‌ పరీక్షకు 2,202 మంది హాజరు

కన్వీనర్‌ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్‌-2025 ఇంజనీరింగ్‌ ఆన్‌లైన్‌ ప్రవేశ పరీక్ష శనివారం కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగిందని కన్వీనర్‌ వీవీ సుబ్బారావు తెలిపారు. మూడు జిల్లాల్లోని తొమ్మిది కేంద్రాల్లో ఉదయం 9నుంచి 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు మొత్తం 2,296 మంది విద్యార్థులకు 2,202 మంది హాజరుకాగా 94 మంది గైర్హాజరయ్యారు. కాకినాడ జిల్లాలో 95.67శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 96.17 శాతం, డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలో 95.78 శాతం హాజరు నమోదైంది. ఇంజనీరింగ్‌ విభాగం పరీక్షలు ఆదివారం కూడా కొనసాగుతాయి. ఏపీ ఇంటర్‌ రెగ్యులర్‌ విద్యార్థులు మినహా సీబీఎస్‌, ఐసీఎస్‌ఈ, ఏపీవోఎస్‌ఎస్‌, ఎన్‌ఐవోఎస్‌, డిప్లొమా, ఇతర బోర్డులకు చెందిన విద్యార్థులు తమ ఇంటర్‌ మార్కులను ఏపీఈఏపీసెట్‌ https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ ద్వారా డిక్లరేషన్‌ ఫారంలో ఈనెల 30వ తేదీలోపు అప్‌లోడ్‌ చేయాలని కన్వీనర్‌ సూచించారు.

పిల్లల కళ్లెదుటే తల్లిదండ్రులు దుర్మరణం



ఘటనా స్థలంలో దుర్గాప్రసాద్‌, సిరి మృతదేహాలు



పోలీస్‌స్టేషన్‌ వద్ద విలపిస్తున్న చిన్నారులు

లారీ రూపంలో మృత్యువు

- తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి డైమండ్‌ జంక్షన్‌ వద్ద ఘటన
- గోకవరం మండలం గోపాలపురంలో విషాదఛాయలు





దుర్గాప్రసాద్‌, సిరి దంపతుల ఫైల్‌ఫొటోలు

దేవరపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): పిల్లలు కాలకృత్యాల కోసం ద్విచక్రవాహనాన్ని రోడ్డుపక్కన ఆపిన తల్లిదండ్రులను మృత్యువు లారీ రూపంలో కబళించింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందిన హృదయ విదారకర ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి డైమండ్‌ జంక్షన్‌ సమీపంలో శనివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి.. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన తొంటా దుర్గాప్రసాద్‌ (32), తొంటా సిరి (29) భార్యభర్తలు. వారికి 11ఏళ్ల కుమార్తె ప్రవల్లిక, 9ఏళ్ల కుమారుడు ఇమ్మానుయేల్‌ ఉన్నారు. దుర్గాప్రసాద్‌ తాపీ మేస్త్రీగా, అతడి భార్య సిరి అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. దుర్గాప్రసాద్‌ అన్నయ్య తొంటా ముసలయ్య దేవరపల్లి మండలం యాద వోలులో ఉండడంతో సెలవులు వచ్చినప్పుడల్లా ఇక్కడికి వస్తుంటారు. దానిలో భాగంగా శనివారం గోపాలపురం నుంచి యాదవోలు బయల్దేరారు. మార్గమధ్యంలో దేవరపల్లి డైమండ్‌ జంక్షన్‌కు వచ్చేసరికి పిల్లలకు టాయిలెట్స్‌ నిమిత్తం వాహనాన్ని రోడ్డుపక్కన ఆపారు. ఈ క్రమంలో దురాప్రసాద్‌, అతడి భార్య బండి వద్ద నిల్చొని తన వెంట తెచ్చుకున్న మామిడికాయల సంచిను సరిచేస్తుండగా రాజమండ్రి వైపు నుంచి ఏలూరు వైపు వెళ్తున్న లారీ అతివేగంతో ఢీ కొని వారిపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడి కక్కడే మృతిచెందారు. పిల్లల కళ్ల ముందే ఈ ఘోర సంఘటన జరగడంతో వారితో పాటు బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ నాగేశ్వర్‌నాయక్‌, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. మృతదేహాలను గోపాలపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఈ ఘటనకు కారణమైన లారీ డ్రైవర్‌ చర్లపల్లికి చెందిన శ్రీశైలంనుపోలీసులు అరెస్ట్‌ చేశారు.

విద్యుదాఘాతానికి ముగ్గురు బలి

విజయవాడలో దుర్ఘటన

మృతుల్లో ఇద్దరు రాజమండ్రి వాసులు



ఘటనాస్థలిలో మృతదేహాలు

విజయవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతం ముగ్గురిని బలి తీసుకుంది. ఒకరిని కాపాడేందుకు మరొకరు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన విజయవాడలోని బెంజిసర్కిల్‌ సమీపాన ఉన్న నారా చంద్రబాబు నాయుడు కాలనీలో శనివారం జరిగింది. విజయవాడకు చెందిన పెరవళి రామకనక దుర్గాప్రసాద్‌ ఐటీఐ విశ్రాంత ప్రిన్సిపాల్‌. ఆయన పేరున నారా చంద్రబాబు నాయుడు కాలనీలో సాయి టవర్స్‌ జీఎఫ్‌2 ఫ్లాట్‌ ఉంది. ఇందులో ఆయన సతీమణి పెరవళి ముత్యావలి ఉంటున్నారు. అయితే కొన్నాళ్లక్రితం ఇద్దరూ విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ ఫ్లాట్‌లో మాత్రం ముత్యావలి నివసిస్తున్నారు. దుర్గాప్రసాద్‌ చేసిన అప్పులు తీర్చకపోవడంతో ఇంటిని కోర్టు జప్తు చేసింది. ఈ ఫ్లాట్‌ను ఖాళీ చేయాలని అడ్వకేట్‌ కమిషన్‌ ఈనెల 16న నోటీసు అంటించింది. ఈ ఫ్లాట్‌లో ముత్యావలి ఉం టుండగా, దుర్గాప్రసాద్‌ పెన మలూరు మండలం పోరంకిలో వేరుగా ఉంటున్నారు. ఇంటిని ఖాళీ చేయాల్సి రావడంతో ముత్యావలి అన్నయ్య తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన సలాది ప్రసాద్‌, ఆయన సతీమణి ఊటుకూరి రాధ కొద్దిరోజుల క్రితం ఇక్కడికి వచ్చారు. ఫ్లాట్‌ ఖాళీ చేయాల్సి రావడంతో సామాన్లు పార్శిల్‌ చేసుకున్నారు. శనివారం ఉదయం ప్రసాద్‌ కుళాయి వద్ద దుస్తులు ఉతుకుతుండగా, ఆయన సోదరి ముత్యావలి తీగపై ఆరేస్తుంది. గుమ్మం ఎదురుగా ఉన్న జియో తీగపై దుస్తులు వేస్తుండగా, విద్యుదాఘాతానికి గురైంది. కుళాయి వద్ద ఉన్న ప్రసాద్‌ పక్కనే ఉన్న వాచ్‌మెన్‌ కుమార్తె ప్రభావతిని పిలిచాడు. ఆమె పైఅంతస్తులో ఉన్నవారిని పిలవడానికి వెళ్లింది. ఇంతలో ప్రసాద్‌ తన సోదరిని కాపాడుకునేందుకు తడి చేతులతో పట్టుకోవడంతో ఆయన కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. భర్త ప్రసాద్‌ పెద్దగా కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న భార్య రాధ కూడా ఆయన్ను రక్షించే ప్రయత్నం చేయడంతో ఆమెకు కూడా షాక్‌ తగిలింది. గుమ్మానికి ఎదురుగా ముత్యావలి, ప్రసాద్‌ పడిపోగా, కొద్దిదూరంలో రాధ పడిపోయింది. కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చి వెంటనే ఫ్యూజులు లాగేశారు. అప్పటికే ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలాన్ని అడ్మిన్‌ డీసీపీ కేజీవీ సరిత, సెంట్రల్‌ జోన్‌ ఏసీపీ కె.దామోదర్‌, పటమట ఇన్‌స్పెక్టర్‌ వి.పవన్‌కిషోర్‌ పరిశీలించారు. విద్యుత్‌శాఖ సిబ్బంది ఘటనాస్థలాన్ని తనిఖీ చేశారు.

జీవనోపాధికి వచ్చి జీవచ్ఛవాలుగా మిగిలి..

ఇద్దరు బిహార్‌ యువకుల మృతి

2 మైనింగ్‌ లారీలు ఢీకొనడంతో ప్రమాదం

కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ఘటన





ప్రమాదంలో మృతిచెందిన బిహార్‌ యువకులు

ప్రత్తిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ లేటరైట్‌ మైనింగ్‌ కొండ వద్ద శనివారం రాత్రి రెండు మైనింగ్‌ లారీలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. వారిని బిహార్‌ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని వంతాడ లేటరైట్‌ మైనింగ్‌ పనుల్లో బీహార్‌ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్‌ (23), చందన్‌కుమార్‌ (21) పని చేస్తున్నారు. వారిద్దరూ శనివారం రాత్రి విధులు ముగించుకుని కొండపై నుంచి కిందకు వచ్చే మైనింగ్‌ లారీలో ప్రయాణిస్తున్నారు. అలాగే కొండ దిగువ నుంచి కొండపైకి వెళ్తున్న మరో మైనింగ్‌ లారీ పరస్పరం కొండ దిగువన గల యార్డు సమీపంలో ఢీకొన్నాయి. లారీలు నుజ్జునుజ్జు అయ్యాయి. పైనుంచి వస్తున్న లారీలో ఉన్న ధీరజ్‌కుమార్‌, చందన్‌కుమార్‌ మృతిచెందారు. వారి మృతదేహాలను శనివారం రాత్రి పది గంటల సమయంలో పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారని సూపరింటెండెంట్‌ డాక్టర్‌ సౌమ్యమైఖేల్‌ తెలిపారు. ప్రత్తిపాడు ఎస్‌ఐ ఎస్‌.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీవనోపాధి కోసం బిహార్‌ నుంచి వచ్చిన వారు మృతి చెందడంతో స్థానికంగా విషాదం అలముకుంది.



నుజ్జునుజ్జయిన లారీ

తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకి

ఎస్‌ఎంసీ చైర్మన్‌ ఆత్మహత్యాయత్నం



దూకిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



కొలిశెట్టి సత్యం (ఫైల్‌ ఫొటో)

కరప, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి వంతెన పైనుంచి ఒక వ్యక్తి తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి... కాజులూరు మండలం గొల్లపాలేనికి చెందిన కొలిశెట్టి సత్యం (42) స్థానికంగా విజయభవాని పలావు సెంటర్‌ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గొల్లపాలెం జిల్లా పరిషత్‌ హైస్కూల్‌కు ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచిన సత్యం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆయనకు భార్యతో పాటు టెన్త్‌, ఇంటర్‌ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం రాత్రి సత్యం గొర్రిపూడి వంతెన వద్దకు వచ్చి చెప్పులు విడిచి ఒక్కసారిగా తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకేశాడు. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే స్పందించి కరప పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ తోట సునీత ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. చీకటి పడడంతో లైట్లను ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక మత్స్యకారులు బోట్లపై నుంచి వలలు విసిరి సత్యం ఆచూకీ కోసం ప్రయత్నించారు. కాకినాడ జగన్నాయక్‌పూర్‌ ఫైర్‌ స్టేషన్‌ నుంచి సిబ్బంది వచ్చి తుల్యభాగ డ్రెయిన్లో విస్తృతంగా గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో పాటు చీకటి పడడంతో ఆదివారం ఉదయం రెస్క్యూ టీమ్‌ సహాయంతో మరలా గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు. భార్యభర్తల మధ్య తలెత్తిన గొడవ కారణంగా సత్యం క్షణికావేశంలో డ్రెయిన్‌ లోకి దూకేసినట్టు స్థానికులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు.

హ్యాండ్లూమ్‌ టెక్నాలజీ డిప్లొమాలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ చేనేత, జౌళి శాఖ అధికారి

కార్పొరేషన్‌ (కాకినాడ), మే 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్‌ ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ హ్యాండ్లూమ్‌ టెక్నాలజీ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్‌ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సులో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కాకినాడ జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కె.పెద్దిరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిప్లొమా కోర్సులో శిక్షణఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళిశాఖ ద్వారా సర్టిఫికెట్‌ జారీ చేస్తామని తెలిపారు. టెన్త్‌ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వారి మార్కుల మెరిట్‌ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ఇంటర్‌ ఎంపీసీ, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు నేరుగా రెండు సంవత్సరంలో చేరవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు నెలకు రూ.2,500 స్టైఫండ్‌ పొందేందుకు అర్హులని తెలిపారు. క్యాంపస్‌ సెలక్షన్స్‌ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఈకోర్సుచేసిన తర్వాత బీటెక్‌ రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశించవచ్చన్నారు. వివరాలకు కాలేజీ వైబ్‌సైట్‌ను, 9866169908, 901024 3054ను సంప్రదించవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు జూన్‌ 1 ఆఖరి తేదీ అని ఆయన తెలిపారు.

ఇదేమి ‘పని’తనం!

పనిచేస్తున్న ఇళ్లకే కన్నం వేసిన పని మనుషులు

- కాకినాడలో మహిళ అరెస్ట్‌
  22 కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువుల స్వాధీనం
- సామర్లకోటలో రూ.6 లక్షల విలువైన బంగారు ఆభరణాలతో మహిళ అరెస్ట్‌

కాకినాడ క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా ఓ ఇంట్లో పని చేస్తూ యజమానురాలు లేని సమయంలో ఆ ఇంటిని కొల్లగొట్టిన పని మనిషి కాకినాడ టూటౌన్‌ పోలీసులకు దొరికిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి... కాకినాడ విద్యుత్‌నగర్‌ ఎస్‌బీఐ కాలనీలో నివసిస్తున్న వి.మణి కలెక్టరేట్‌ ప్రాంగణంలోని వికాస సంసలో మేనేజర్‌గా పనిచేస్తోంది. ఆమె శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఇంటికి తాళం వేసి విధులకు హాజరై సాయం త్రం 5.30 గంట లకు వచ్చింది. బీరువాలో ఉన్న 22 కాసుల బంగారు ఆభరణాలు, ఇతర వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించి వెంటనే టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. టూటౌన్‌ సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మణి ఆఫీసుకు వెళ్లేటప్పుడు ఒకచోట తాళం పెట్టి వెళ్తుంది. ఇది తెలిసిన పని మనిషి రమ్య యజ మాని వెళ్లగానే ఆ తాళం తీసుకుని ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను తీసుకుని ఉడాయించింది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు రమ్యను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. తానే ఆభరణాలను దొంగిలించినట్టు ఒప్పుకోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని మణికి అప్పగించారు. కేసును చేధించిన సీఐ అప్పలనాయుడు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సామర్లకోటలో....

సామర్లకోట, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో సింగవరపు సత్యనారాయణ ఇంటిలో ఇటీవల జరిగిన చోరీ సంఘటనలో సామర్లకోట పోలీసులు దర్యాప్తు మేరకు ఇంటిలో పనిచేస్తున్న వీర్రాఘవపురానికి చెందిన బొడ్డు దుర్గాదేవిని విచారించగా చోరీకి గురైన రూ.6 లక్షల విలువైన బంగారపు ఆభరణాలు, 17 చిన్న డైమండ్స్‌, స్మార్ట్‌ వాచ్‌ను స్వాధీనం చేసుకున్నట్టు శనివారం రాత్రి సీఐ కృష్ణభగవాన్‌ విలేకర్లకు తెలిపారు. అంబటి వారి తోటలోని సత్యనారాయణ ఇంటిలో జరిగిన ఈ చోరీపై సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు చేశారు. ఇంటిలోనే పనిమనిషిగా పని చేస్తున్న దుర్గాదేవిని అనుమానించి పోలీసులు తమదైన కోణంలో దర్యాప్తు నిర్వహించడంతో తానే చోరీకి పాల్పడినట్లు అంగీకరించడమే గాక ఆమె ఇంటిలో దాచి ఉంచిన ఆభరణాలు తదిత ర చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. కాగా దుర్గాదేవిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌ నిమిత్తం కోర్టు ఎదుట హాజరుపర్చనున్నట్టు సీఐ తెలిపారు. ప్రతీ ఇంటి యజమానులు ఇల్లు విడిచి వేరే ప్రాంతాలకు వెళ్లినపుడు ఎల్‌హెచ్‌ఎంఎస్‌ తప్పనిసరిగా వాడాలని సూచించారు. అలాగే ఇంటిలో పనిమనుషులను పెట్టుకున్న ప్పుడు వారి కదలికలపై నిఘా ఉంచాలని తెలిపారు.



కాకినాడ జిల్లా సామర్లకోటలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణభగవాన్‌

రత్నగిరిపై భక్తుల సందడి

రూ.50 లక్షల ఆదాయం

అన్నవరం, మే 24 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధి శనివారం భక్తులతో పోటెత్తింది. వైశాఖమాసం వివాహ ముహూర్తాల్లో శుక్రవారం చివరి ముహూర్తం కావడంతో సత్యదేవుడి సన్నిధిలో వివాహం చేసుకున్న జంటలతో పాటుగా వివిధ ప్రాంతాల్లో ఒక్కటైన నూతన జంటలు తమ బృందాలతో స్వామివారి సన్నిధిలో వ్రతాలు ఆచరించారు. శనివారం ఒక్కరోజు సుమారు 4వేల వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.50లక్షలు ఆదాయం సమకూరింది.

‘ప్రసాద్‌ స్కీం’ పనులకు టెక్నికల్‌ బిడ్‌లో ఆరుగురు

భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్‌స్కీం పనులకు దశాబ్దకాలంగా అవాంతరాలు ఎదురవుతున్నాయి. గతనెలలో టెండర్లు పిలిచి ఫైనల్‌చేసిన అనంతరం సింహాచలం దేవస్థానంలో చందనోత్సవ ఏర్పాట్లలో నిర్మాణంకూలి పలువురు మృతి చెందిన ఘటనలో అన్నవరం పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ అక్కడ గోడనిర్మించిన సంస్థ ఒక్కటే కావడంతో ప్రభుత్వం ఆ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. దీంతో టూరిజం అధికారులు షార్టుటెండర్‌ నోటిఫికేషన్‌ జారీచేశారు. శనివారం తెరిచిన టెక్నికల్‌ బిడ్‌లో ఆరుగురు గుత్తేదారులు టెండర్లలో పాల్గొన్నారని, ఫైనాన్స్‌ బిడ్‌ను తెరిచి టెండర్ల ఖరారు ప్రక్రియ పూర్తి చేస్తామని టూరిజంశాఖ అధికారులు తెలిపారు. ఫైనాన్స్‌బిడ్‌లు సోమవారం ఓపెన్‌ చేయనున్నట్టు వారు స్పష్టం చేశారు.

అమలాపురంలో...

నేడు పవర్‌ లిఫ్టింగ్‌ చాంపియన్‌షిప్‌

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో నిర్వహణ

అమలాపురం టౌన్‌, మే 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా అమలాపురం సర్‌సీవీ రామన్‌ స్కూలు ఆవరణలో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయి పవర్‌ లిఫ్టింగ్‌ చాంపియన్‌షిప్‌-2025 పోటీలు నిర్వహిస్తున్నట్టు అమలాపురం హెల్త్‌ అండ్‌ ఫిట్‌నెస్‌ జిమ్‌ కోచ్‌ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. మూడో పవర్‌ లిఫ్టింగ్‌ చాంపియన్‌షిప్‌ పోటీలకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి 130మందికి పైగా పవర్‌ లిఫ్టర్లు ఇప్పటికే తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. మెన్‌, ఉమెన్‌, మాస్టర్స్‌ విభాగాల్లో పోటీలు జరుగుతాయి. 53 కిలోలు, 59, 66, 74, 83, 93, 105 కిలోలు, 105 కిలోలు పైబడిన విభాగాల్లో వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామన్నారు. అమలాపురం హెల్త్‌ అండ్‌ ఫిట్‌నెస్‌ జిమ్‌ స్పోర్ట్స్‌ క్లబ్‌ అసోసియేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు.

5 నుంచి అప్పనపల్లి

బాలబాలాజీ కల్యాణోత్సవాలు

నేడు పందిరిరాట

మామిడికుదురు, మే 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీ వార్షిక కల్యాణోత్సవాలు జూన్‌ 5వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని సహాయ కమిషనర్‌ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 25న ఆదివారం ఉదయం 11.30గంటలకు పందిరి రాట ముహూర్తం చేయిస్తున్నట్టు తెలిపారు. 5వ తేదీ గురువారం నుంచి 9వ తేదీ సోమవారం వరకు కల్యాణోత్సవాలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. భక్తులు స్వామి కల్యాణోత్సవాలను వీక్షించి ప్రసాదాలు స్వీకరించాలని సహాయ కమిషనర్‌ కోరారు.

సొంతింటికల సాకారమే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కరరెడ్డి


కాపవరంలో చెంచులతో ఇళ్ల నిర్మాణాలపై మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

బిక్కవోలు, మే 24(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరికీ మన ఇల్లు- మన గౌరవం పథకంలో సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.భాస్కరరెడ్డి అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం ఆయన బిక్కవోలులోని నాలుగు సచివాలయాల పరిధిలోని అసంపూర్తి ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అదనంగా రూ. 50వేలు ఇస్తుందని, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన కాపవరంలో పది మంది చెంచులు గుడారాలు వేసుకుని నివసిస్తుండడాన్ని గమనించి స్థలం, ప్రభుత్వ రుణం ఇచ్చే ఇళ్ల నిర్మాణాలపై వారితో మాట్లాడారు. అందుకు వారంగీకరించడంతో సెంటున్నర స్థలం ఇవ్వాలని, అందుకు పట్టాలు తయారు చేయాలని తహశీల్దార్ సత్యకృష్ణకు సూచించారు. ఈయన వెంట డీఈఈ ఆర్.వెంకటేశ్వరబాబు, ఎంపీడీవో వి.శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ వనమయ్య పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్టు.. 15 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం, మే 24(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నార్త్ స్టేషను పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి సారాను స్వాధీనం చేసుకున్నారు. సీఐ హనుశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రేడు, రాజమండ్రి సోమాలమ్మ గుడి ప్రాంతాల్లో ఎస్ఐ సీహెచ్ రాజేశ్, సిబ్బందితో కలిసి సీఐ సోదాలు చేశారు. చిత్రాడ అనంతలక్ష్మి, రెడ్డి హరిబాబును అరెస్టు చేసి వాళ్ల నుంచి 15లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసులు పెట్టారు. ఈ సందర్భంగా సీఐ హనుశ్రీ మాట్లాడుతూ స్టేషను పరిధిలోని అర్బన్, రూరల్ మండలాల్లోని సారా తయారీ, విక్రయాలపై నిఘా పెట్టామన్నారు. మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు కచ్చితంగా నిబంధనలు పాటించకపోతే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు.

వాంబే కాలనీ వాసుల సమస్య తీర్చాం

లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి


లెగసీ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఆర్అండ్‌బీ వాంబే కాలనీ, సమీప ప్రాంతాల ప్రజలకు డంపింగ్‌యార్డు దుర్వాసన నుంచి ఇన్నాళ్లకు విముక్తి కలిగిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక పేపరుమిల్లు రోడ్డులోని ఆర్అండ్‌బీ వాంబే కాలనీకి సమీపంలోని డంపింగ్ యార్డులో రూ.5.72 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన లెగసీ వేస్ట్ మెనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్లాంట్‌లో బయోట్రీట్‌మెంట్ అయ్యాక ఇక్కడ చెత్తకు సంబంధించి చిన్న వ్యర్థం కూడా ఉండదన్నారు. ఆరునెలలలో పూర్తవుతుందని, అక్టోబరు 2 నాటికి స్థానిక 42,45,46 డివిజన్ల ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటారని తెలిపారు. చెత్త ట్రీట్మెంట్ జరిగాక మిగిలిన వాటిని ఇక్కడనుంచి తరలిస్తారన్నారు. కాకినాడ మాదిరిగా జిందాల్ తో ఒప్పందం చేసుకుంటామని ఇప్పటికే ప్రభుత్వంలో ఎంవోయూ అయ్యిందన్నారు. మంత్రి నారాయణ ఆరెకరాల భూమిలో చర్యలు చేపట్టారని చెప్పారు. అర్అండ్‌బీ వాంబే కాలనీలో గత ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిన కమ్యూనిటీ హాలును తిరిగి బాగు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, కొయ్యల రమణ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి బీమా అందజేత

రాజమహేంద్రవరంలో ఇటీవల మృతిచెందిన స్థానిక 14వ డివిజన్‌కు చెందిన టీడీపీ కార్యకర్త బోగారపు త్రినాథ్ కుటుంబానికి రూ.5లక్షల బీమా లేఖను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అందించారు. శనివారం త్రినాథ్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే బీమా చెక్కును త్రినాథ్ తల్లి నాగమల్లేశ్వరి బ్యాంక్ ఖాతాకు జమచేస్తూ మంత్రి నారా లోకేశ్ పంపిన లేటర్‌ను ఆమెకు అందించారు. ఈ సందర్భంగా కార్యకర్తను కుటుంబ సభ్యుడిగా భావించేది టీడీపీ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి, ఈతలపాటి రవిబాబు, బంగారు నాగేశ్వరరావు, యర్రంశెట్టి రాజ్ కుమార్, నీలాపు వెంకటేశ్వరరావు, ఉడమల నాగేశ్వరరావు, మోర్ల సోమరాజు, గొర్రిపర్తి ప్రతాప్ పాల్గొన్నారు.

అష్టోత్తర సిందూర పూజ

చాగల్లు, మే 24 (ఆంధ్రజ్యోతి): శ్రీఅభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. శనివారం స్వామికి అష్టోత్తర సింధూర అర్చన నిర్వహించారు. అనంతరం సుందరకాండ పారాయణం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కేసవి బాలమిత్ర భజన సమాజం కోలాట భజన కాలక్షేపం జరిపింది.

ది ఏపీపీ మిల్స్ సొసైటీ రుణాలు చెల్లించని వారిపై చర్యలు

కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం సిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): ది ఏపీపీ మిల్స్ ఎంప్లాయిస్ మల్టీపర్పస్ సహకార సంఘం లిమిటెడ్ నెం 1426 రాజమండ్రిలో రుణాలు తీసుకుని చెల్లించకుండా రిటైర్ అయిపోయిన వారిపైన, ప్రస్తుతం ఉద్యోగులుగా ఉన్న వారిపైన చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి సహకార శాఖను ఆదేశించారు. 1964 చట్టం ప్రకారం రుణాలు తీసుకుని చెల్లించని వారికి నోటీసులు ఇవ్వాలని జిల్లా సహకార శాఖ అధికారిని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా అర్హతకు మించి రుణాలు తీసుకున్న వారిపై లీగల్ చర్యలు తీసుకోవాలన్నారు.

పార్కులతో ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం

- దశల వారీగా అభివృద్ధి
- నాలుగు ప్యాకేజీలుగా పనులు
- మొదటి ప్యాకేజీలో రూ.1.96 కోట్లతో ఏడు పార్కులు
- మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్


పార్కును పరిశీలించి సూచనలు ఇస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రజలకు ఆరోగ్యంతో పాటు చక్కటి ఆహ్లాదాన్ని పంచే విధంగా పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలో పదో డివిజన్‌లో ఆల్ బ్యాంక్ కాలనీ పార్కు, 9వ డివిజన్ స్టేట్ బ్యాంక్ కాలనీ పార్కులను పరిశీలించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనుల్లో భాగంగా దశల వారీగా పార్కులను అభివృద్ధి పరుస్తున్నామన్నారు. మొత్తం నాలుగు ప్యాకేజీలుగా పనులు చేపడుతున్నామని, మొదటి ప్యాకేజీలో రూ.1.96 కోట్లతో ఏడు పార్కులు అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే మూడు పార్కుల్లో పనులు ప్రారంభించామన్నారు. 9వ డివిజన్‌లో స్టేట్ బ్యాంక్ కాలనీ పార్కులో చిన్నారులు ఉల్లాస పరిచేందుకు అవసరమైన ఆట వస్తువులతోపాటు విశాలమైన వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. 10వ డివిజన్‌లో ఆల్ బ్యాంక్ కాలనీలో పార్కును మ్యూజికల్ పార్కుగా అభివృద్ధి పరచనుండగా ఇందులో అందరికి ఆకర్షించేలా వివిధ సంగీత వాయిద్యాలతో కూడిన శిల్పాలు ఉంటాయన్నారు. అలాగే స్థానిక మోడల్ కాలనీలో పార్కును యోగా పార్కుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈ మదార్ల ఆలీ షేక్, ఏడీహెచ్ స్వాతి, డీఈఈ నిరూపాక్షరావు, ఏఈలు సత్యనారాయణ, సంజయ్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
- త్వరలో ముక్కినాడ, కలవచర్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో సబ్‌స్టేషన్లు


జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, మే 24(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విద్యుత్‌శాఖాధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో బత్తుల మాట్లాడుతూ నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాయే ధ్యేయంగా పనిచేస్తున్నామని, అధికారులు సహకరించాలన్నారు. నియోజకవర్గానికి 144 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కాగా 54 ట్రాన్స్‌ఫార్మర్లను త్వరగా పూర్తి చేసినందుకు అధికారులను అభినందించారు. అలాగే 40 ట్రాన్స్ ఫార్మర్ల పనులు ప్రగతిలో ఉన్నట్టు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ముక్కినాడలో 33/11కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల సేకరణ వేగవంతం చేయాలని తహశీల్దార్ జీఏఎల్ సత్యవతిదేవికి సూచించారు. కలవచర్లలో ఇండస్ట్రియల్ పార్క్‌లో 33/11కేవీ సబ్‌స్టేషన్ మంజూరుకు వెంటనే భూమి బదలాయించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. కోటికేశవరంలో సబ్‌స్టేషన్ మంజూరుపై మరో మారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే అన్నారు. పాడైపోయిన 565 విద్యుత్ స్తంభాలకు సంబంధించి రూ.85 లక్షలు కేటాయించారని, అందులో 421 పోల్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలు

మండలంలో కానవరం గ్రామానికి చెందిన వైసీపీకి కార్యకర్తలు శనివారం జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక జనసేన కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పార్టీ కండువాలను మెడలో వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌క ళ్యాణ్ పాలన పట్ల ప్రజలంతా ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సంగీత జార్జి, సంగీత ప్రసాద్, సంగీత చక్రవర్తి, సంగీత గణపతి, నంగిరెడ్డి వెంకటరమణ తదితరులున్నారు.

పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి పూర్ణిమరాజు

దివాన్‌చెరువు, మే 24 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు పంచాయతీ కార్మికులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీఎస్ పూర్ణిమారాజు అన్నారు. దివాన్‌చెరువులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బకాయి ఉన్న మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలతో బాటు మే నెల జీతం కుడా జూన్ 1న చెల్లించాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్న వీరికి ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని కార్మిక చట్టాలు అమలు చేయాలని, అందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని తదితర డిమాండ్లు చేసారు. తుక్కు ట్రాక్టర్లు పాడైపోయి కార్మికుల కాళ్లకు గాయాలై ప్రాణాపాయస్థితికి చేరుకున్న వైద్య సహాయం అందించకపోవడం అన్యాయమన్నారు.సమావేశంలో యూనియన్ నాయకులు టి.మంగా, వేమగిరిసతీష్, ఎం.వసంతాలు, గౌరి, విజయ్, లాజరు, గణపతి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం సిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): దహించు అగ్ని సంస్థ వ్యవస్థాపకుడు థామస్ ఆధ్వర్యంలో స్థానిక నటరాజ్ ప్రాంగణంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. తన తల్లి మేరిసెల్వం జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 500 మంది మందికి కళ్లు, బీపీ షుగరు తదితర వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ అవార్డును అందుకున్న థామస్‌ను సత్కరించారు. 34 ఏళ్లగా ఆంధ్రాలో 1000, తెలంగాణలో 800 క్రైస్తవ సంఘాల ద్వారా పేదలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని థామస్ చెప్పారు. కార్యక్రమంలో షీబా, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సాతి కమిటీ సర్వే

- నెల రోజుల పాటు నిర్వహణ
- డీఎల్ఎస్ఏ కార్యదర్శి జానీ బాషా

రాజమహేంద్రవరం, మే 24(ఆంధ్రజ్యోతి): ఆధార్ లేని అనాథ బాలలను గుర్తించి ఆధార్ కార్డును అందించడం, విద్యావకాశాన్ని కల్పించడం, తగు వైద్య సేవలు అందించడం వంటి వాటి కోసం సాతి కమిటీ సర్వేను ఈ నెల 26 నుంచి వచ్చే నెల 26 వరకూ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి(ఇన్‌చార్జి) షేక్ జానీ బాషా పేర్కొన్నారు. సర్వే ఫర్ ఆధార్ అండ్ యాక్సెస్ టు ట్రాకింగ్ అండ్ హోలిస్టిక్ ఇంక్లూజన్ ఆన్ 13 మే 2025పై సాతి సర్వే కమిటీ సభ్యులకు శనివారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధుల్లో, వసతిగృహాల్లో 18ఏళ్లలోపు వయసున్న అనాథలను గుర్తించి ఆధార్ కార్డు జారీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవడమే సాతి కమిటీ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్సు కౌన్సిల్ బి.జగదీష్‌కుమార్, తహ శీల్దార్లు పాల్గొన్నారు.

ఐరన్ గడ్డర్ విరిగిపడి దంపతులకు గాయాలు

నిడదవోలు, మే 24(ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని ఓవర్ బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకల నియంత్రణకు ఏర్పాటు చేసిన ఐరన్ గడ్డర్ జారిపడి మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం నుంచి మోటారుసైకిల్‌పై సంకెళ్ల నాగేశ్వరరావు, రామలక్ష్మి దంపతులు తాడేపల్లిగూడెం బయలుదేరారు. నిడదవోలులో ఓవర్ బ్రిడ్జి దిగుతుండగా భారీ వాహనాల నియంత్రణకు ఏర్పాటు చేసిన ఐరన్ గడ్డర్ విరిగి వారిపై పడింది. ఈ ఘటనలో నాగేశ్వరరావు చేతికి ఫ్యాక్చర్ కాగా, రామలక్ష్మికి తలపై బలమైన గాయమైంది. వీరిని జనసేన పట్టణ కార్యదర్శి కర్రి ఉమా సత్యనారాయణ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవలకు రాజమహేంద్రవరం తరలించారు.

మహానాడుకు తరలిరండి

ఉండ్రాజవరం, మే 24 (ఆంధ్ర జ్యోతి): కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే టీడీపీ మహానాడుకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శనివారం వేలివెన్నులో నియోజకవర్గంలోని టీడీపీ మం డలాధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే మహానాడుకు అధిక సంఖ్యలో తరలి వచ్చేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చే యాలని కోరారు. గ్రామాల నుం చి మహానాడుకు తీసుకువచ్చే బాధ్యతలు, ఇతర అంశాలపై శేషారావు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

• నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ


సమావేశంలలో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మే 24(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణాలతోపాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల్లో కొవిడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. విశ్వవిద్యాలయంలో శనివారం ప్రిన్సిపాల్స్, డీన్స్‌తో సమావేశమై పలు విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా వీసీ మ్లాడుతూ కరోనా కేసులు మరలా నమోదవుతున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయం కుటుంబసభ్యులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించడం, శానిటైజర్లతో చేతులు శుభ్రం చూసుకోవడం వంటి కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇక్కడి ప్రాంగణంతోపాటు కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలు, ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలు కోవిడ్‌జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైద్యఆరోగ్యశాఖ సూచించిన నియమ నిబంధనలపై అందరికీ అవగాహన కల్పించి స్వీయ పరిరక్షణతో కొవిడ్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. త్వరలో విద్యాసంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో కళాశాలలు పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అన్ని కళాశాలలు మొక్కలు నాటి అహ్లాదకరమైన వాతావరణంను నెలకొల్పాలని చెప్పారు. అలాగే రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ విశ్వవిద్యాలయ అధికార్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వంగలపూడిలో ఇసుక అక్రమ తవ్వకాలు

- ఆర్డీవోకు స్థానికుల ఫిర్యాదు
- తక్షణ చర్యలకు తహశీల్దార్‌ను ఆదేశించిన కృష్ణనాయక్
- లారీలను అడ్డగించిన స్థానికులు


ములకల్లంకలో ప్రజాభిప్రాయసేకరణ సభ

సీతానగరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలపూడి, సింగవరం ఇసుక ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని మాజీ సైనికుడు, న్యాయవాది సూరెడ్డి శివకుమార్ అన్నారు. శనివారం వంగలపూడి, సింగవరం ర్యాంపుల వద్ద స్టాక్ పాయింట్‌లను వంగలపూడి ఉపసర్పంచ్ కాండ్రేగుల ఫణి, స్థానికులు సూరెడ్డి మురళీకృష్ణ, సూరెడ్డి రామారావు కొంచ బాబూరావు, ఇపురపు అప్పాజీ, కాండ్రేగుల పోశిరత్నాజీరావు గోదావరి పరివాహక ప్రాంతంలోని ఇసుక తవ్వకాలను పరిశీలించారు. ములకల్లంకలో ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభకు అధికారులు వచ్చారనే సమాచారంతో అక్కడకు చేరుకుని ఆర్డీవో కృష్ణనాయక్‌తో మాట్లాడారు. సభలో మాట్లాడడానికి అనుమతి ఇవ్వడంతో న్యాయవాది మాట్లాడుతూ వంగలపూడి, సింగవరం ర్యాంపుల వద్ద 20 మీటర్లు లోతు తవ్వకాలు జరుపుతున్నారని, నిబంధలను అతిక్రమించి రాత్రుళ్లు అధిక సంఖ్యలో లారీలపై ఇసుక రవాణా చేస్తున్నారన్నారు. సరిహద్దులు లేకుండా ఇష్టానుసారం తవ్వకాలు జరుపుతున్నారని వివరించారు. దీంతో ఆర్డీవో స్పందించి తక్షణమే వంగలపూడి ర్యాంపుపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఏమైనా అభ్యంతరం ఉంటే శాండ్ కమిటీకి తెలియజేయాలని సూచించారు. అనంతరం శివకుమార్ తదితరులు వంగలపూడి ర్యాంపునకు చేరుకుని సాయంత్రం 6గంటల తరువాత ఇసుక తీసుకెళ్లడానికి అనుమతి లేదని లారీలను అడ్డుకున్నారు.


రాత్రిపూట జరుగుతున్న ఇసుక తవ్వకాలను అడ్డగించిన స్థానికులు

ప్రజాభిప్రాయాల మేరకు నూతన ఇసుక ర్యాంపు : ఆర్డీవో

గ్రామస్థుల అభిప్రాయాల మేరకు నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆర్డీవో కృష్ణనాయక్ తెలిపారు. శనివారం ములక్లంక గ్రామ సచివాలయం వద్ద నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుపై జరిగిన పర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఆయనతో పాటు కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి శంకర్, మైన్స్ ఏజీ విఘ్నేష్, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ ములకల్లంక రెవెన్యూకు చెందిన సర్వే నెంబర్ 46/1బి, 46/1ఎఫ్‌లో 2.003 హెక్టార్ల భూ మిలో 60,000 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలు జరుగుతాయన్నారు. కాటవరం ర్యాంపు నుంచి రవాణా జరుగుతుందన్నారు. శంకర్ మాట్లాడుతూ ఇసుక తవ్వకాలపై ప్రజాభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తావమన్నారు. రైతులు మాట్లాడుతూ ఇసుక తవ్వకాల వల్ల గ్రామం వైపు గోదావరి వరద నీరు వేగంగా వస్తుందని, కొంత కాలానికి గ్రామం కనుమరుగవుతుందన్నారు. ఇప్పటికే ధనికులు వేరే గ్రామానికి వెళ్లిపోయారని, అవకాశాల్లేక పేదలు మాత్రం ఇక్కడే ఉన్నారన్నారు. తమకు బొబ్బిల్లంకలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మైన్స్ ఏడీ ఫణిభూషన్, డివిజన్ సర్వే డీఐటీఎస్ కృష్ణ, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





సత్యవాడలో శానిటేషన్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు



8

పిల్లల కళ్లెదుటే!

పెదనాన్న ఇంటికి వెళుతున్నామని .. ఆ చిన్నారులు ఎంతో ఆనందంగా ఉన్నారు.. ఇంటి నుంచి బండిపై బయలుదేరింది మొదలు అమ్మా నాన్నతో కబుర్లు చెబుతూనే ఉన్నారు.. అవే చివరి మాటలు అవుతాయని.. అదే అమ్మానాన్నతో చివరి ప్రయాణం అవుతుందని ఆ చిన్నారులకు తెలియదు పాపం.. అందుకే బైక్‌పై వెళుతుండగానే టాయిలెట్ వస్తుందని నాన్నతో చెప్పారు.. అంతే బండి రోడ్డు పక్కగా ఆపి అక్కకు తమ్ముడిని తోడుగా పంపారు.. అలా వెళ్లి తిరిగి చూసేసరికి లారీ రూపంలో మృత్యువు కబళించడంతో అప్పటి వరకూ తమతో ఉన్న అమ్మానాన్న అనంతలోకాల్లో కలిసిపోయారు.. ఇది చూసిన ఇద్దరు చిన్నారుల నోట మాటలేదు.. అమ్మా నాన్నా కావాలంటూ కన్నీళ్లు తప్ప..!

కరోనా.. హైరానా!

తొలి కేసు నమోదుతో అంతటా ఆందోళన

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మళ్లీ కొవిడ్ వైరస్ జాడలు వెలుగు చూస్తున్నాయి. దేశ రాజధానితో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో కొవిడ్ వైరస్ కేసులు నమోదవుతున్నాయి. ఏపీ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరేట్ ఇటీవల కొవిడ్ అప్రమత్తతపై ప్రజలు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ ఉత్తర్వులిచ్చిం ది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులతో కొందరు జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. మళ్లీ కొవిడ్ వ్యాప్తిచెందుతోందన్న వార్తలతో ఏవైనా లక్షణాలు కనిపిస్తే ప్రజలు వెంటనే అప్రమత్తం అవుతున్నారు.ఇప్పటికే కొందరు మాస్కులు పెట్టుకుని తిరుగుతున్నారు. కాగా ప్రార్థనా సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీల కార్యక్రమాలు వంటి సామూహిక సమావేశాలను నిలిపివేయాలని హెల్త్ డిపార్టుమెంట్ సైతం ఆదేశించింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో కొవిడ్ 19 జాగ్రత్తలు పాటించాలని వృద్ధులు, గర్భిణులు ఖచ్చితంగా కొవిడ్ జాగ్రత్తలు తీసుకుంటూ ఇళ్లకే పరిమితం కావాల్సిందిగా సూచించారు. మాస్కులు ధరించాలని సూచించారు. కొవిడ్ 19 లక్షణాలు ఉంటే ముందుగా పరీక్ష చేయించుకుని ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలు పాటించాలని సూచించారు. ఆరోగ్యశాఖ అన్ని పరీక్షా సౌకర్యాలతో కూడిన ల్యాబ్‌లు, మాస్కులు, పీపీఈ కిట్లు, ట్రిపుల్ లేయర్ మాస్కులు తగినంత పరిణామంలో ఆసుపత్రిలో సిద్ధం చేసుకోవాల్సిందిగా సూచనలు చేశారు. కాకినాడ, రాజమహేంద్రవరంలలోని జీజీహెచ్‌లలో ప్రత్యేక వార్డులను ఏర్పాటుచేశారు.కోనసీమ జిల్లా సత్యవాడలో కొవిడ్ కేసు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తం అయ్యారు. జలుబు, జ్వరం ఉన్నవారంతా ఆందోళన చెందుతున్నారు.

- అప్రమత్తమైన అధికారులు
- జిల్లా ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డులు

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో కొవిడ్ ఐసోలేషన్ వార్డు

రాజమహేంద్రవరం అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. సోమవారం నాటికి వార్డు సిద్ధం కావొచ్చని చెబుతున్నారు. ముందుగా 15 బెడ్స్‌తో ఐసోలేషన్ వార్డును సిద్ధం చేసి, అవసరమైతే మరో 15 బెడ్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. పాత మలేరియా అధికారి కార్యాలయం నిర్వహించిన రేకులషెడ్డును కొవిడ్ ఐసోలేషన్ వార్డుగా మార్చాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం షెడ్డులో ఉన్న సామాగ్రిని తరలించే కార్యక్రమం చేపట్టారు. బెడ్స్, ఆక్సిజన్, ఇతర వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేసి అందుబాటులోకి తెస్తారు.



సత్యవాడలో వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కోనసీమలో తొలి కేసు..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడకు చెందిన వృద్ధుడికి గత మూడు రోజులుగా లోఫీవర్, నిరంతరంగా ముక్కు కారడం వంటి సమస్యలతో బాధపడుతుండడంతో కుటుంబీకులు శుక్రవారం రాత్రి ద్రాక్షారామలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు కొవిడ్ ర్యాపిడ్ కిట్ పరీక్ష నిర్వహించి పాజిటివ్‌గా గుర్తించారు. అనంతరం అతడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు.కుటుంబీకులు శనివారం జీజీహెచ్‌కు తరలించగా అతని స్వాబ్ శాంపిల్‌తో ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేసి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారించారు.అనంతరం అతన్ని ఈఎన్‌టీ విభాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొవిడ్ వార్డుకు తరలించి చికిత్సను అందజేస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ వెల్లడించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోనే ఈ ఏడాది ఇదే తొలి కేసు కావడంతో వైద్య వర్గాలన్నీ అప్రమత్తం అయ్యాయి.

ఆందోళన వద్దు.. అప్రమత్తత అవసరం



కొవిడ్‌తో ఆందోళన వద్దు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సత్యవాడకు చెందిన వృద్ధుడికి కొవిడ్ పాజిటివ్ రావడంపై మంత్రి స్పందించా రు. పాజిటివ్ వచ్చిన వ్యక్తికి తేలికపాటి లక్షణాలు మాత్రమే ఉన్నా యి. జిల్లా వైద్యశాఖ అధికారులు, కాకినాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదు.. ధైర్యంగా ఉండాలి. కరోనా లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకుని తగిన వైద్యసేవలు పొందాలి. - **వాసంశెట్టి సుభాష్, మంత్రి**

అక్రమాలు.. తవ్వేస్తారు!



నాడు సెల్ఫీ తీసుకున్నారు... నేడు లెక్క తీస్తారు : ఆగస్టు 17 2023న జొన్నాడలో ఇసుక గుట్టల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న చంద్రబాబు(ఫైల్)

ఇసుకాసురుల్లో 'సిట్' గుబులు

ఇక ఇసుక అక్రమాల వంతు వచ్చింది.. గత వైసీపీ హయాంలో లెక్కలను తవ్వనున్నారు.. నాడు వంద కోట్ల రూపాయల విలువైన ఇసుకను దోపిడీ చేసిన కీలక నేతల గుండెల్లో గుబులు రేగుతోంది.రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమాలపై సిట్‌'ను ఏర్పాటు చేస్తూ తీసుకున్న నిర్ణయం గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డ ఇసుక మాఫియా అక్రమాలు వెలుగు చూస్తాయనే ఆందోళన అప్పుడే ప్రారంభమైంది.. నాడు ప్రతిపక్ష నాయకుడి హోదాలో జిల్లా పర్యటనకు హాజరైన చంద్రబాబు ఆలమూరు మండలం జొన్నాడ వద్ద సెల్ఫీ చాలెంజ్ విసిరారు. ఇప్పుడు సీఎం హోదాలో ఆ అక్రమాలను వెలికితీసే పనిలోపడ్డారు..

- వైసీపీలో ఇసుక దోపిడీపై దర్యాప్తు
- వందల కోట్ల ఇసుక తరలింపు
- ప్రేమ్‌రాజ్ బలవన్మరణంపై ఆరా
- సుప్రీం కోర్టుకు తప్పుడు నివేదిక
- డ్రెడ్జింగ్ మతలబుపైనా కన్ను
- యథేచ్ఛగా సాగిన అక్రమాలు
- ఇష్టానుసారంగా అనుమతులు
- నాడు సహకరించిన అధికారులు

(రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో గోదావరిలో జరిగిన ఇసుక దోపిడీపై సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో అప్పటి సర్కారీ పెద్దలతో పాటు ఇసుక దోపిడీలో భాగమైన అధికార, అనధికారుల వెన్నులో వణుకు మొదలైంది. కొవ్వూరు, నిడదవోలు, రాజ మహేంద్రవరం, రూరల్, రాజానగరం, రామచంద్రపురం, మండపేట, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని ర్యాంపుల నుంచి ఐదేళ్ల కాలంలో వందల కోట్లు విలువైన ఖనిజ సంపద దోచుకుపోయారు. నాడు ఏపీఎండీసీకి అప్పగించినట్టే అప్పగించి వేల కోట్లు దోచుకున్నారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా వందల కోట్ల రూపాయల ఇసుక అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది.నాడు జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల్లో లభ్యమయ్యే వందల కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా దోచేశారు.

దోపిడీ సాగిందిలా..

ఇసుకలో వైసీపీ దోపిడీ అంతా ఇంతా కాదు.. గోదావరిని జోన్-2, జోన్-3 కింద విభజించి మొదట జేపీ వెంచర్స్‌కు రెండేళ్లకు కాంట్రాక్టు ఇచ్చారు. ఈ సంస్థ ఆన్‌లైన్ లావాదేవీలు చేయకుండా ఒకే ఒక్క బిల్లు బుక్ పట్టుకుని అక్రమంగా లక్షలాది టన్నుల ఇసుకను తరలిం చేసింది. 2023 మే నెలలో ఈ సంస్థ కాంట్రాక్టు ముగియడంతో వారిని పక్కన పెట్టి అప్పటి వైసీపీ సర్కారీ పెద్దలు తెరమీదకు వచ్చారు. జేపీ సంస్థ వాడిన బిల్లులనే చూపిస్తూ అనధికారికంగా మరింత బరితెగించిన సంగతి తెలిసిందే. వీరు ఏకంగా ర్యాంపులన్నింటికీ ఒకే వ్యక్తికి అప్పగించి నెలకు సుమారు రూ.30 కోట్ల వరకూ చెల్లించేలా ఒప్పందం పెట్టుకున్నారు. ఇసుక తవ్వకముందే వారికి డబ్బు ఇచ్చేటట్టు లోపాయికార ఒప్పందం జరిగింది. కొవ్వూరు డివిజన్‌లోని ర్యాంపులను కొవ్వూరుకు చెందిన వైసీపీ నేత ప్రేమ్‌రాజ్ దక్కించుకుని అప్పులపాలయ్యాడు. అనంతరం ప్రేమ్‌రాజ్ కొవ్వూరులో రైల్వే పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తి చేయనీయలేదు. తాడేపల్లి నుంచి కొందరు పెద్దలు పంపిన వ్యక్తులు వచ్చి ప్రేమ్‌రాజ్ కేసును మూయించేసినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. ఇవాళ సిట్‌ని నియమించడంతో ఈ కేసును పూర్తిగా దర్యాప్తు చేస్తే ఇసుక కుంభకోణాల డొంక కదలకతప్పదు. రాజమహేంద్రవరం వైపు ఆర్‌కే అనే వ్యక్తి మొత్తం ర్యాంపులను తీసుకుని సర్కారుకు కప్పం చెల్లించిన సంగతి తెలిసిందే. ఇందులో కొన్ని కుంభ కోణాలు కోర్టు వరకూ వెళ్లడంతో సుప్రీంకోర్టు విచారణకు ఆదేశించింది. దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్‌తో కూడా తప్పుడు రిపోర్టు ఇప్పించినట్టు ప్రచారం జరిగింది. గోదావరిలో అక్రమాలపై ధవళేశ్వరం గ్రామానికి చెందిన వంశీ అనే ఇసుక వ్యాపారి కోర్టును ఆశ్రయించడంతో ఎస్పీ ఆఫీసుకు అతన్ని పిలిపించి అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు చుట్టుముట్టి అతని చేత బలవంతంగా ఫిర్యాదు వెనక్కి తీయించడం అప్పట్లో సంచలన మైంది.ఇదంతా తాడేపల్లి పెద్దల ఒత్తిడితోనే జ రిగినట్టు ప్రచారం జరిగింది.

నాడు చంద్రబాబు సెల్ఫీ చాలెంజ్

ఆగస్టు 17 2023లో జొన్నాడలో ఉన్న ఇసుక గుట్టలను చంద్రబాబు నాయుడు సందర్శించారు.కోనసీమ జిల్లా పర్యటనలో భాగంగా అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల పేర్లను ప్రస్తావిస్తూ ఇసుక దోపిడీలో ఎన్ని వందల కోట్లు దోచుకున్నారో లెక్కలతో సహా ఆరోపణాస్త్రాలు సంధించారు.అప్పటి వైసీపీ ప్రభుత్వానికి సెల్ఫీ చాలెంజ్ చేశారు.ఇసుక దోపిడీలో నాటి ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కీలక పాత్ర వహించినట్టు తేల్చారు.ఇప్పుడు సీఎం హోదాలో లెక్క తేల్చనున్నారు.

కోర్టును తప్పుదారి పట్టించి..

ఇసుక కుంభకోణాలు, అక్రమాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇక్కడ అసలు డ్రెడ్జింగ్ అక్రమాలు జరగలేదని, నిబంధనలు ఎవరూ ధిక్కరించలేదని ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంస్థ పేరునే డ్రెడ్జింగ్ జరిగినట్టు ఓ బూటకపు నాటకాన్ని తెరమీదకు తేవడం కూడా చాలా మందికి తెలిసే ఉంటుంది. అప్పట్లో ధవళేశ్వరం బ్యారేజి నుంచి కాతేరు శివారు వెంకటనగర్ వరకూ,కొవ్వూరు డివిజన్ లోనూ రాత్రీ పగలూ అనధికారికంగా డ్రెడ్జింగ్ జరిగిన సంగతి తెలిసిందే.2023 మే నెల నుంచి వందలాది డ్రెడ్జింగ్ పడవలతో ఇసుక దోపిడీ జరిగింది.2023 డిసెంబర్‌లో ప్రతిమ సంస్థ పేరుతో రంగంలోకి దిగి డ్రెడ్జింగ్ చేశారు.దీనిని ప్రక్కదారి పట్టించడానికి గతంలో డ్రెడ్జింగ్‌కు అనుమతి పొందినా ఇసుక తీయని సంస్థను తెరమీదకు తెచ్చి నాటకాలాడారు. ఇందులో బోట్స్‌మన్ సొసైటీలను భాగస్వామ్యం చేశారు. ఇలా కోర్టును తప్పుదారి పట్టించడమే కాకుండా రూ.వందల కోట్లు బిల్లులు ఇవ్వాలని తర్వాత ప్రభుత్వానికి బిల్లులు పెట్టడం గమనార్హం. దీనికి అప్పటి మైన్స్,ఇరిగేషన్ అధికారులు సహకరించడం,జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తేవడం అందరికీ తెలిసిందే.నాడు బ్రిడ్జిల పక్కనా తవ్వేశారు.ధవళేశ్వరం బ్యారేజి, రోడ్ కం రైలు బ్రిడ్జి, గామన్ వంతెన, హేవలాక్ బ్రిడ్జి ప్రాంతాల్లోనూ యథేచ్ఛగా తవ్వేశారు.గనులు, భూగర్భశాఖకు చెందిన యంత్రాంగం అప్పటి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే పనిచేసింది. మైన్స్ అధికారులు ఎన్ని అక్రమాలు జరిగినా పట్టించుకోలేదు.

వైసీపీలో సిట్ గుబులు..

ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ జిల్లాల వ్యాప్తంగా ఎక్కడ ఎంత మేర ఇసుక దోపిడీ జరిగింది. నాటి ప్రభుత్వానికి ఎంత ఆదాయం వచ్చిందనే అంశంపై లెక్కలు తేల్చి బాధ్యులను గుర్తించేందుకు పోలీసు అధికారులతో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసింది.ఇదిలా ఉండగా కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి స్వగ్రామమైన గోపాలపురంలో శనివారం వైసీపీ కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో విందు సమావేశాన్ని నిర్వహించారు. సరిగా అదే సమయానికి ఇసుక అక్రమాలపై సిట్ ఏర్పాటు చేశారన్న సమాచారం తెలుసుకున్న కొందరు నాయకులు ప్రాథమికంగా చర్చించుకున్నట్టు తెలిసింది.మొత్తంమీద జిల్లాలో దోపిడీపై సిట్ ఏర్పాటు అన్న సమాచారం అటు అప్పటి వైసీపీ ప్రతినిధులు,అప్పట్లో కీలకంగా పనిచేసిన పలు శాఖల అధికారుల్లో గుబులు రేపుతోంది.





చిగురు మేఘం నాటికలోని ఒక సన్నివేశం.. ఎంపీ పాకా సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి

సమాజ హితమే.. నాటికల అభిమతం

నాటిక పోటీల ముగింపు సభలో ఎంపీ పాకా సత్యనారాయణ

అనపర్తి, మే 24 (ఆంధ్రజ్యోతి) : సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు పుట్టిన నాటికలను పోషించడం కూడా ఒక కళేనని అది నల్లమిల్లి మూలారెడ్డికే దక్కిందని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. అనపర్తి మండలం రామవరంలోని నల్లమిల్లి మూలారెడ్డి కళా పరిషత్ 36వ జాతీయ స్థాయి నాటిక పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. మూలారెడ్డి జడ్పీ పాఠశాల సుబ్బిరెడ్డి కళా మందిరంలో జరిగిన ముగింపు సభలో ఆయన మాట్లాడారు. కళలపై ఉన్న మక్కువతో 36 ఏళ్లుగా పరిషత్ నిర్వహించడం సామాన్య విషయం కాదన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ నల్లమిల్లి కుటుంబానికి కళామతల్లి ఆశీస్సులు మెండుగా ఉంటాయన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ తండ్రి మూలారెడ్డి ఆశయాలను బతికించాలన్న తపనతో రామకృష్ణారెడ్డి పరిషత్‌ను నిరాటంకంగా నడిపించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే, పరిషత్ అధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎటువంటి ఆటంకం కలగకుండా పరిషత్ నిర్వహిస్తామన్నారు. ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి,జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్లు కడలి ఈశ్వరి,తుమ్మల పద్మ, శిల్పి వడయార్, రైస్ మిల్లర్ల జిల్లా అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి, పారిశ్రామికవేత్త మేడపాటి రామలింగారెడ్డి, వైద్యులు తాడి రామగురెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిగురు మేఘం

నాటిక ప్రదర్శనలో ఆఖరి రోజైన శనివారం రాత్రి తొమ్మిదవ నాటికగా ప్రదర్శించిన అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం ఆకట్టుకుంది. పల్లెటూరులో పుట్టిన కల్యాణ్ తన పేద తల్లిదండ్రులు కష్టంతో వైద్య విద్యను పూర్తి చేస్తాడు. ఇంతలో పట్టణంలో కార్పొరేట్ ఆసుపత్రి అధినేత ధనుంజయరావు కుమార్తె డాక్టర్ శోభనను పెండ్లాడి పట్టణంలో స్థిరపడతాడు. చివరకు తల్లిదండ్రులను పట్టించుకోలేనంత బిజీగా మారతాడు. చివరకు తన తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడంతో తండ్రి ఆమెను వెంటబెట్టుకుని కొడుకు దగ్గరకు చేరుకుంటాడు. శోభన ఆమె తండ్రి ధనుంజయరావు కల్యాణ్ తల్లిదండ్రులను అక్కడి నుంచి ఊరికి పంపే ప్రయత్నం చేయడంతో భార్యాభర్తల మధ్య వివాదాలు తలెత్తుతాయి. వారి మధ్య వాదనలు జీర్ణించుకోలేని కల్యాణ్ తల్లి గుండె పగిలి మరణిస్తుంది. చివరకు భార్యను, కార్పొరేట్ ఆసుపత్రిని వదలి పల్లెలో పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు తండ్రితో పయనమవడంతో నాటిక ముగుస్తుంది.

ఉత్తమ నాటికలివే..

నాలుగు రోజుల పాటు తొమ్మిది నాటికలు ప్రదర్శించగా చైతన్య కళా భారతి కరీంనగర్ వారు ప్రదర్శించిన చీకటి పువ్వు ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. తెలుగు కళా సమితి విశాఖపట్నం వారు ప్రదర్శించిన నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారి నాన్నా నేనొచ్చేస్తా నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిలవగా శర్వాణీ గిరిజన సాంస్కృతిక సేవా కేంద్రం బోరివంక వారు ప్రదర్శించిన కొత్త పరిమళం నాటిక ఉత్తమ జ్యూరీ బహుమతి గెలుచుకొంది. ఉత్తమ రచన జనరల్ బోగీలు రచయిత పీటీ మాధవ్, ఉత్తమ దర్శకత్వం చీకటిపువ్వు దర్శకుడు ఎం.రమేష్, ఉత్తమ నటుడు పిటీ వరప్రసాద్, ఉత్తమ నటిగా ఎస్.అమృత వర్షిణి ఎంపికైనట్లు న్యాయ నిర్ణేతలు ప్రకటించారు.

యోగాంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు జారీ చేస్తామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టర్‌లో శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యోగా కార్యక్రమంలో పాల్గొనే వారు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.యోగాంధ్ర.ఏపీఇన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జూన్ 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. మే 26 నుంచి 30 వరకు అన్ని ప్రాథమిక స్థాయిల వారికి యోగా ఫర్ ఆల్ గ్రాస్ రూట్స్‌పై అవగాహన కార్యక్రమాలు, పేర్లు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. జూన్ 2 నుంచి 7 వరకు యోగా వారిధి ద్వారా ఐక్యత అంశంగా మండల స్థాయిలో సంఘాలతో కూడిన కార్యక్రమాలు,జూన్ 9 నుంచి 14వ తేదీవరకు యోగా, యువత ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం అనే అంశంపై జిల్లా స్థాయిలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయిలో నిర్వహించే రాష్ట్ర గ్రాండ్ ఫినాలేలో జూన్ 16 నుంచి 18 తేదీ వరకు యోగాంధ్ర - గ్లోబల్ యోగా షోకాస్ అంశంపై ప్రదర్శన నిర్వహిస్తారన్నారు. కళాత్మక యోగా పోటీల విభాగంలో యోగా పాట, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, రోల్ ప్లే విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. నాలెడ్జ్ ఆధారిత పోటీల విభాగంలో యోగా క్విజ్, యోగా పోస్టర్ ఆవిష్కరణ, యోగా నినాదం, యోగా వ్యాసం ,యోగా షార్ట్ ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. జేసీ ఎస్ చిన్నరాముడు పర్యవేక్షిస్తారన్నారు.

మళ్లీ రోడ్డెక్కిన అన్నదాత

నిడదవోలు, మే 24 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత మళ్లీ రోడ్డెక్కాడు.. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, డబ్బులు తమ ఖాతాలకు జమ చేయా లని కొందరు రైతులు డిమాండ్ చేశారు. నిడదవోలు మండలం డి.ముప్పవరం గ్రామంలోని సెంటరులో శనివారం రైతులు భారీ ఎత్తున ధర్నా చేశారు. రైతులు వద్ద నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని గాలికొదిలేసిందన్నారు.తమ వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కొందరు రైతులు భీష్మించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లో ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు..ఈ నెల 7వ తేదీ నుంచి విక్రయించిన ధాన్యానికి సొమ్ములు రావడం లేదని మరి కొందరు రైతులు వాపోయారు. జాయింటు కలెక్టర్ తమ వద్దకు రావాలని డిమాండ్ చేశారు.నిడదవోలు మండలంలో 60 వేల మెట్రిక్ టన్నులు నమోదు చేసుకోగా ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాల ద్వారా 53 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. మిగిలిన 7 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు టార్గెట్ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి నిడదవోలు మండలానికి టార్గెట్ వచ్చేలా చేస్తామని కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖరరావు రైతాంగానికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. సోమవారానికల్లా తమ సమస్యలకు పరిష్కారం లభించకపోతే భారీ ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ధర్నా కారణంగా నిడదవోలు నరసాపురం ప్రధాన మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.



నిడదవోలు మండలం డి.ముప్పవరం సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతాంగం

'పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాలు'



మదర్‌థెరిస్సా హోమ్‌లో మాట్లాడుతున్న జడ్జి అనురాధ

కొవ్వూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాలు అందుకోవచ్చని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వూరు సత్యవతినగర్‌లోని మదర్ థెరిస్సా హోంలో మిస్సింగ్ చిల్డ్రన్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హోమ్‌లోని విద్యార్థులతో ముచ్చటించారు. చదువుకునే వయస్సులో నిర్లక్ష్యం వహించరాదని, ఇష్టపడి చదివితే లక్ష్యం చిన్నది అవుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు బి. విజయకుమార్, న్యాయవాది శ్రీవల్లీ, తదితరులు పాల్గొన్నారు.

'కడపలో జరిగే మహానాడుకు తరలిరావాలి'


వేలివెన్నులో జరిగిన సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శేషారావు, నాయకులు

ఉండ్రాజవరం, మే 24 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27,28,29 తేదీలలో జరిగే టీడీపీ మహానాడుకు నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శనివారం వేలివెన్నులో నియోజకవర్గంలోని పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో జరిగిన సమావేశంలో శేషారావు మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే మహానాడుకు అధిక సంఖ్యలో తరలి వచ్చేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. గ్రామాల నుంచి మహానాడుకు తీసుకువచ్చే బాధ్యతలు, ఇతర అంశాలు గురించి శేషారావు మాట్లాడారు. పార్టీ నాయకులు సింహాద్రి రామకృష్ణ,కొమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు, ఏ. సత్తిరాజు, ఈర్పిన సత్యనారాయణ, వెలిచేటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త చాటుకున్న అభిమానం

● ప్రహరీగోడపై ఎన్టీఆర్, చంద్రబాబు చిత్రాలు గీయించుకున్న వైనం


తాడిపర్రులో ఓ గోడపై వేసిన దివంగత ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు చిత్రాలు

ఉండ్రాజవరం, మే 24 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రుకి చెందిన టీడీపీ కార్యకర్త, అభిమాని గారపాటి సుబ్బారావు పార్టీపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు. తన ఇంటి ప్రహరీ గోడపై ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు చిత్రాలనుపెయింటింగ్‌తో వేయించుకున్నాడు. చిత్రాలకు పెయింటింగ్ పూర్తవడంతో స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించాడు. టీడీపీ, ఎన్టీఆర్, చంద్రబాబుపై ఉన్న అభిమానంతో ఇలా చేసినట్టు సుబ్బారావు చెప్పారు.

కిసాన్ మోర్చ కమిటీల బలోపేతానికి కృషి

గోపాలపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామగ్రామాన కిసాన్ మోర్చ కమిటీలు నియమించి, వాటి బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. ముందుగా వాదాలకుంట పొగాకు రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పొగాకు రైతులు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు సత్యకుమార్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్, మండల అధికార ప్రతినిధి గెల్లా సత్తిబాబు, మండల కిసాన్ మోర్చ అధ్యక్షులు ఉండవల్లి మార్కెండేయ చౌదరి, జిల్లా కార్యదర్శి బొడ్డు వీరరాఘవులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దేవిన శ్రీనివాస్, సీనియర్ నాయకులు రత్నాజీ చౌదరి, పెనుమత్స రంగరాజు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి డీలర్లతో రేషన్ పంపిణీ : ఎమ్మెల్యే


ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసిన రేషన్ డీలర్లు

కొవ్వూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల ఒకటో తేదీ నుంచి డీలర్ల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం పట్టణంలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో రేషన్‌డీలర్లు ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం మొబైల్ వ్యాన్లు రద్దు చేసి రేషన్ డీలర్ల నుంచే బియ్యాన్ని అందించేందుకు నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఎండీటీ వ్యాన్లు నిత్యవసరాలను ఇంటింటికీ పంపిణీ చేయలేదని, అలా చెప్పి వీధిలో ఒకచోట పెట్టి అందించేవారన్నారు. ఎవరైనా ఆసమయంలో రాకపోతే ఆనెల సరుకులు ఇచ్చేవారు కాదన్నారు. దీన్నిదృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రజలు, డీలర్లు స్వాగతిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, పిల్లలమర్రి మురళీకృష్ణ, పట్టణ, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

27న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన పట్టణంలో చేపట్టిన, చేపట్టబోతున్న పలుఅభివృద్ధి అంశాలపై చర్చిస్తామన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పలుశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

అన్న క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి


అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

కొవ్వూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం పట్టణంలోని అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు. దీనిలో భాగంగా భోజనాలు చేస్తున్న వారిని ఆహార పదార్థాల నాణ్యతతో పాటు నిర్వాహకుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ఈయనతోపాటు మున్సిపల్ ఆర్‌ఐ బి. శ్యామ్, తదితరులు ఉన్నారు.

రాజేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

చాగల్లు, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మరణించిన గాడి రాజేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు గాలింకి రాజు కోరారు. శనివారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసి రాజేష్ కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో రాజేష్ కుటుంబ దీనస్థితిని దృష్టిలో ఉంచుకుని వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ కిట్ల పంపిణీ


కిట్లను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామారావు

తాళ్లపూడి, మే 24 (ఆంధ్రజ్యోతి): పెద్దెవంలో శనివారం జనసేన పార్టీ గ్రామాధ్యక్షుడు నామన చిన బూరయ్య ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, పార్టీ జిల్లా కార్యదర్శి గాయత్రీ వెంకటేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో పలువురు సభ్యులు క్రియాశీలకంగా తమవంతు కృషిచేశారని కొనియాడారు. అనంతరం క్రియాశీల సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముప్పనపల్లి వీరబాబు, వీరమహిళ పసలపూడి వెంకటలక్ష్మి, వేము పాయి, పసలపూడి ప్రసాదు, నామన దుర్గా ప్రసాదు, గంగిరాజు దివాకర్, తదితర జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

అష్టోత్తర సింధూర పూజ

చాగల్లు, మే24 (ఆంధ్రజ్యోతి): అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. శనివారం స్వామి వారికి అష్టోత్తర సింధూర అర్చన నిర్వహించారు. అనంతరం సుందరకాండ పారాయణం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం కేసవి బాలమిత్ర భజన సమాజం వారిచే కోలాట భజన కాలక్షేపం జరిగింది.

కొవ్వాడ కాల్వలో పూడికతీత పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, మే 24 (ఆంధ్రజ్యోతి): కొవ్వాడ కాలువ ముప్పు నుంచి రైతులను ఆదుకునేలా పూడికతీత పనులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం గజ్జరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకోసం ఎన్డీయే ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతోందని, దానిలో భాగంగానే నియోజకవర్గానికి రూ. ఏడు కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు ఉపయోగపడే పుంతరోడ్లకు రూ. నాలుగు కోట్ల కేటాయించామన్నారు. రెండవదిగా కొవ్వాడ పూడికతీత పనులు చేపట్టామని గజ్జరం, తుపాకుల గూడెం, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట, కొవ్వూరు మండలంలోని ధర్మవరం, కాపవరం, చాగల్లు మండలంలోని పలుగ్రామాల్లో ఈ పనులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, కొఠారు వెంకట్రావు, గన్నిన సత్తిబాబు, మైనం గంగరాజు, గ్రామ ఉపసర్పంచ్ శేషు, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్యాప్రికార్న్ డిస్టిలరీ ఎక్స్‌టెన్షన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణీ సుస్మిత

తాళ్లపూడి, మే 24 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేట పంచాయతీ పరిధిలో గల క్యాప్రికార్న్ డిస్టిలరీ కంపెనీలో చేపట్టిన అదనపు పనులకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణీ సుస్మిత ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఫ్యాక్టరీ అభివృద్ధి పనులపై ఎవరికైనా అభ్యంతరాలు, తగు సూచనలు, అభిప్రాయాలు ఉంటే తమకు తెలియపరచాలన్నారు. పలువురు గ్రామస్థులు, నాయకులు, ఎన్జీవోలు మాట్లాడుతూ ప్రథమంగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గ్రామ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. అలాగే కంపెనీ సీఎస్ఆర్ నిధుల నుంచి పరిసర గ్రామాలలో చెట్ల పెంపకం, విద్యార్థులకు లైబ్రరీ, మంచినీటి ఆర్వో ప్లాంట్లు నిర్మించి ప్రజలకు ఉపయోగపడేలా చెయ్యాలన్నారు. ఫ్యాక్టరీ ప్రతినిధి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కంపెనీ 90 కేఎల్ నుంచి 180 కేఎల్‌కు పెంచడం జరిగిందని దీనివల్ల ఎటువంటి వాయు, జలకాలుష్యం రాదని కంపెనీలో ఏడెకరాలలో మొక్కలు పెంచడం జరుగుతుందని తెలిపారు. యూనిట్ హెడ్ కృష్ణన్ ఉన్నితన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్, ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి, కంపెనీ జీఎం మూర్తి, సర్పంచ్ సుధారాణి, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు, కొవ్వూరు
ఐ.పి.నెం.11/2025

Between

(1) బొమ్మారెడ్డి వీర సుధీర్ రెడ్డి
తండ్రి: గున్నేశ్వర రెడ్డి, డోరు నెం.3-114, గోపాలపురం గ్రామం, గోపాలపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా

(2) కళ్ళ అప్పలరాజు,
తండ్రి: సత్యనారాయణ, డోరు నెం.2-153/ఏ, గోపాలపురం గ్రామం,గోపాలపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా ... పిటీషనర్స్

మరియు

(1) తోట సుధీర్ కుమార్,
తండ్రి:సత్యవేదం, డోరు నెం.1-13/1 అన్నదేవరపేట గ్రామం, తాళ్ళపూడి మండలం, తూర్పు గోదావరి జిల్లా

(2) తోట ప్రసన్న కుమారి,
వైఫ్/ఆఫ్. సుధీర్ కుమార్, డోరు నెం.1-13/1 అన్నదేవరపేట గ్రామం, తాళ్ళపూడి మండలం, తూర్పు గోదావరి జిల్లా,

(3) అఫీషియల్ రిసీవర్,
పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు ...రెస్పాండెంట్స్

ప్రకటన

పై తెలిపిన పిటీషనర్స్, 1వ రెస్పాండెంట్ ది. 09-01-2025 సం.రం. తేదీన 2వ రెస్పాండెంట్ పేరున పోలవరం సబ్-రిజిస్ట్రార్ వారి ఆఫీసులో దస్తావేజు నెం.111/2025రుగా రిజిష్టరు కాబడిన సెటిల్మెంట్ దస్తావేజును రద్దు చేసి సదరు షెడ్యూలు ఆస్తిని 3వ రెస్పాండెంట్ వారు బహిరంగ వేలం ద్వారా విక్రయం జరిపి పిటీషనర్లు బాకీ చెల్లింపు కోరుతూ పై కోర్టులో ఇన్సాల్వెన్సీ పిటీషన్ దాఖలు చేసినారు. సదరు పిటీషన్లో ఎవరికైనా ఏ విధమైన ఆక్షేపణలు ఉన్నచో ది.18-06-2025 సం.రం. తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం గం.10-30ని॥లకు స్వయంగా గాని న్యాయవాది వారి ద్వారాగాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను అని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఇట్లు: బి.వి.రమణరావు
వి.సతీష్ కుమార్, కె.వి.ఎస్.ఎస్.అరవింద్
న్యాయవాదులు, కొవ్వూరు

నేటి నుంచి రేగులమ్మ జాతర


పెద్దాపురంలో కొలువైన అమ్మవారు

గోపాలపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం గ్రామదేవత రేగులమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 15 రోజుల పాటు నిర్వహించే ఈ జాతర ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్ని దర్శించుకోవాల్సిందిగా జాతర సభ్యులు కోరారు.

50 లీటర్ల సారా స్వాధీనం


ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న సారా

కొవ్వూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి. సత్యనారాయణ తెలిపారు. శనివారం తాళ్లపూడి మండలం తుపాకుల గూడెం, తాడిపూడిలో దాడులు నిర్వహించి కేతా రాంబాబు, జుత్తిక లక్ష్మణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎస్ఐ ఈ. రవికుమార్, హెచ్‌సీ సత్యనారాయణ, సిబ్బంది సీహెచ్‌వీ దొర, పద్మ పాల్గొన్నారు.

అక్రమ మద్యం, సారా తయారు చేస్తే పీడీ యాక్టు

కొవ్వూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం, సారా తయారు చేసినా, రవాణా, అమ్మకాలు చేపట్టినా అట్టివారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి. సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో పరిధిలోని చాగల్లు, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో మద్యంషాపులు, బార్‌లు, రెస్టారెంట్లు విధిగా లైసెన్సు నిబంధనలు పాటించాలన్నారు. మద్యం ఎంఆర్‌పీకే విక్రయించాలన్నారు. అలాగే సమయపాలన ఖచ్చితంగా పాటించాలన్నారు. విడి అమ్మకాలు చేయరాదన్నారు. రికార్డులు సమర్థవంతంగా నిర్వహించి, సీసీ కెమెరాలు అమర్చాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని షాపులపై కేసులు నమోదు చేస్తామన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ 14405కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

జీవో నెంబర్ 30 ను వినియోగించుకోవాలి

దేవరపల్లి, మే24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 30 ప్రకారం 2019 అక్టోబర్ 15వ తేదీ కంటే ముందుగా మం డలంలోని అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో అనధికారికంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారి ఇళ్లను ప్రభుత్వం క్రమబద్ధీ కరిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహశీల్దార్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు క్రమబద్ధీకరించటానికి అభ్యంతరంలేని ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో ఉన్నవారు ఇంటిపన్ను, కరెంటు బిల్లులతో గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 15 సంవత్సరాలు పైబడి గ్రామశివారుల్లోని పోరంబోకు స్థలాల్లో బెస్మెంట్‌తో కాంక్రీటు లేదా రేకుల రెడ్డు నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామ సచివాలయాల్లో ఇచ్చిన దరఖాస్తులను కలెక్టర్, సబ్‌కలెక్టర్, ఆర్డీవోల సమక్షంలో పరిశీలించి సమగ్ర విచారణ జరిపి శాశ్వత నివాసపత్రం ఇచ్చేవిధంగా కృషి చేస్తామని తహశీల్దార్ తెలిపారు.

డ్వాక్రా మహిళా ఉత్పత్తుల విక్రయాలకు స్టాళ్లు


నిడదవోలులో వస్తు విక్రయ ప్రదర్శన

నిడదవోలు, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులను వీక్లీ మార్కెట్‌లో విక్రయించేందుకు శనివారం స్టాళ్లను ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం అందిస్తామని అధికారులు తెలిపారు. అధికారులు ఉన్నారు.

ఐరన్ గడ్డర్ విరిగిపడి భార్యాభర్తలకు గాయాలు


గాయపడిన నాగేశ్వరరావు

నిడదవోలు, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవర్ బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకల నియంత్రణకు ఏర్పాటు చేసిన ఐరన్ గడ్డర్ విరిగడంతో అటుగా మోటారు సైకిల్‌పై వెళ్తున్న భార్యాభర్తలపై పడడం వల్ల తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళితే రాజమండ్రి నుంచి యాక్టీవాపై సంకెళ్ల నాగేశ్వరరావు, రామలక్ష్మి దంపతులు శనివారం తాడేపల్లిగూడెం వెళుతుండగా ఓవర్‌బ్రిడ్జి దిగుతున్న క్రమంలో గడ్డర్ విరిగి పడింది. దీంతో నాగేశ్వరరావు చేతికి ఫ్యాక్చర్ కాగా, రామలక్ష్మికి తలకు బలమైన గాయమైంది. దీనిపై స్పందించిన జనసేన పార్టీ పట్టణ కార్య దర్శి కర్రి ఉమా సత్యనారాయణ నిడవోలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రికి తరలించారు.


'సమస్యమీది ... పరిష్కరించే బాధ్యత నాది'


దొండపూడి గ్రామదర్శిని సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి, ఇతరులు

గోపాలపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ప్రజలు తెచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించే బాధ్యత నాదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శనివారం దొండపూడి, హుకుంపేట, గోపవరం, చిట్యాల, వేలచింతలగూడెం, వెంకటాయపాలెం, చెరుకుమిల్లిలో గ్రామదర్శినిని నిర్వహించారు. దొండపూడి గ్రామకమిటీ అధ్యక్షుడు ముత్యాల రాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల్లో తనను నమ్మి ఓట్లు వేసిన ప్రజలందరి సమస్య తీర్చే బాధ్యత తన భుజస్కంధాలపై ఉందన్నారు. అందులో భాగంగానే నియోజకవర్గంలో కొవ్వాడ, యర్రకాల్వ, తాడిపూడి కాల్వ కారణంగా ప్రతి ఏటా నియోజకవర్గంలో వరద ముంపునకు ఆరువేల ఎకరాల పంట మునిగిపోతుందన్నారు. దీంతో అన్నదాత నష్టాల పాలవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే గ్రామదర్శినికి శ్రీకారం చుట్టామన్నారు. మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, కార్యదర్శి వడ్లమూడి రమేశ్, ఏఎంసీ చైర్మన్ బ్రహ్మరాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, సీనియర్ నాయకుల కొర్లపాటి రాము, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ఆ శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల కళ్లెదుటే... తల్లిదండ్రులు దుర్మరణం

● లారీ రూపంలో కబళించిన మృత్యువు
● దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ప్రమాదం
● గోకవరం మండలం గోపాలపురంలో విషాదఛాయలు



మృతులు దుర్గాప్రసాద్, సిరి (ఫైల్ ఫొటో)

దేవరపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): పిల్లలు కాలకృత్యాల కోసం ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కన ఆపిన ఆ భార్యాభర్తలను మృత్యువు లారీ రూపంలో కబళించింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ హృదయ విదారకర ఘటన దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది.పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. గోకవరం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన తొంటా దుర్గాప్రసాద్ (32), తొంటా సిరి (29) భార్యాభర్తలు. వీరికి 11 సంవత్సరాల కుమార్తె ప్రవల్లిక, తొమ్మిది సంవత్సరాల కుమారుడు ఇమ్మానియేల్ ఉన్నారు. అయితే దుర్గాప్రసాద్ తాపీమేస్త్రీగా, అతని భార్య సిరి అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. దుర్గాప్రసాద్ అన్నయ్య తొంటా ముసలయ్య యాదవోలులో ఉండటంతో సెలవులు వచ్చినప్పుడల్లా ఇక్కడకి వస్తుంటారు. దానిలో భాగంగా శనివారం గోపాలపురం నుంచి యాదవోలు బయల్దేరారు. మార్గమధ్యలో దేవరపల్లి డైమండ్ జంక్షన్‌కు వచ్చే సరికి పిల్లలకు టాయిలెట్స్ నిమిత్తం వాహనాన్ని రోడ్డుపక్కన ఆపారు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్, అతని భార్య బండి వద్ద నిల్చొని తనవెంట తెచ్చుకున్న మామిడికాయల సంచిను సరిచేస్తుండగా రాజమండ్రివైపు నుంచి ఏలూరు వైపు వెళ్తున్న లారీ అతివేగంతో వీరిపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందారు. పిల్లల కళ్ల ముందే ఈ ఘోర సంఘటన జరగడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనస్థలాన్ని సీఐ నాగేశ్వర్ నాయక్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. మృతదేహాలను గోపాలపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం : కాకినాడ.
ప్లాట్ నెం.2, ఐడిఎ, రమణయ్యపేట, కాకినాడ - 533 005.

పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

పర్యావరణము, అడవులు మరియు వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం వారిచే జారీచేయబడిన ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నోటిఫికేషన్ తేది.14.09.2006 మరియు వాటి సవరణలకు అనుగుణంగా ప్రకటించునది ఏమనగా **తూర్పు గోదావరి జిల్లా, తాళ్ళపూడి మండలం, ప్రక్కిలంక గ్రామము లోని సర్వే నెం.: 161/1 & 161/2 నందలి 6.556 హెక్టర్ల పట్టాభూమి ప్రాంతంలోని సాధారణ ఇసుక మైనింగ్ కొరకు ప్రక్కిలంక లంకలు బ్లాక్-VII** ప్రతిపాదన గురించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరుపబడును. ప్రతిపాదిత ప్రాజెక్ట్ కార్యకలాపాలకు కంపెనీ వారు ఇచ్చిన వివరములు ఈ క్రింద పొందుపరచబడినవి.

1. **ప్రాజెక్టు ఆఫీస్ పేరు మరియు చిరునామా:**
6.556 హెక్టార్లు, సాధారణ ఇసుక మైనింగ్ కొరకు పట్టాభూమి గల ప్రక్కిలంక లంకలు బ్లాక్-VII లో సర్వే నెం.: 161/1 & 161/2 ప్రక్కిలంక గ్రామం, తాళ్ళపూడి మండలం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534341.
2. **ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతం మరియు విస్తీర్ణం:**
తూర్పు గోదావరి జిల్లా, తాళ్ళపూడి మండలం, ప్రక్కిలంక గ్రామము లోని సర్వే నెం.: 161/1 & 161/2 నందలి.
విస్తీర్ణం : 6.556 హెక్టర్లు
3. **సంప్రదించవలసిన అధీకృత వ్యక్తి పేరు, చిరునామా మరియు టెలిఫోన్ నెం.:**
శ్రీ డి.ఫణిభూషణ్ రెడ్డి,
మొబైల్ నెం.: 9100688824
చిరునామా : జిల్లా మైన్స్ & జియాలజి అధికారి, జిల్లా మైన్స్ & జియాలజి కార్యాలయం, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
4. **ప్రతిపాదిత ప్రాజెక్టు యొక్క వ్యయం :**
రూ.27.0 లక్షలు (అక్షరాల ఇరవై ఏడు లక్షల రూపాయలు మాత్రమే)
5. **ప్రతిపాదిత ప్రాజెక్ట్ యొక్క వ్యాపార స్వభావం ఉత్పత్తి సామర్థ్యం :**
సాధారణ ఇసుక మైనింగ్:
సంవత్సరానికి 1,96,680 క్యూబిక్ మీటర్లు.
6. **ప్రజాభిప్రాయ సేకరణ : తేది, సమయం మరియు ప్రదేశం :**
తేది : 26.06.2025
సమయం : ఉదయం 10:00 గం॥లకు
ప్రదేశం : ప్రక్కిలంక పంచాయితి ఆఫీస్, ప్రక్కిలంక గ్రామం, తాళ్ళపూడి మండలం, తూర్పుగోదావరి జిల్లా.
7. **ప్రాజెక్టుకు సంబంధించిన తెలుగు మరియు ఇంగ్లీష్ నందు గల కార్య నిర్వాహక సారాంశము మరియు డ్రాఫ్ట్ ఇ.ఐ.ఎ. రిపోర్టు యొక్క ప్రతులు ప్రజల పరిశీలనార్థం లభ్యమగు ప్రదేశము(లు):**
a) కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయం, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
b) ముఖ్య కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, కాకినాడ.
c) జనరల్ మేనేజర్ వారి కార్యాలయం,జిల్లా పరిశ్రమల కేంద్రం, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
d) డిప్యూటీ డైరెక్టర్(యస్), పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయం మరియు క్లైమేట్ ఛేంజ్, భారత ప్రభుత్వం, సమీకృత ప్రాంతీయ కార్యాలయం (ఐఆర్ఒ), గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
e) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ ఆఫీస్, మాధవధార, ఉడా కాలని, మాధవధార మెయిన్ రోడ్డు, విశాఖపట్నం-18.
f) జిల్లా మైన్స్ & జియాలజి వారి కార్యాలయం, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
g) తహసీల్దార్ వారి కార్యాలయం, తాళ్ళపూడి మండలం, తూర్పు గోదావరి జిల్లా.
h) మండల పరిషత్ డెవలప్‌మెంట్ వారి కార్యాలయం, తాళ్ళపూడి మండలం, తూర్పు గోదావరి జిల్లా.
i) పంచాయితి సెక్రటరి వారి కార్యాలయం, ప్రక్కిలంక గ్రామం, తాళ్ళపూడి మండలం, తూర్పు గోదావరి జిల్లా.
j) పర్యావరణ ఇంజనీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, రీజనల్ ఆఫీస్, ప్లాట్ నెం.2, ఐడిఎ, రమణయ్య పేట, కాకినాడ.

సంబంధిత ప్రజలు వారి సలహాలు, అభిప్రాయాలు, వ్యాఖ్యలు మరియు అభ్యంతరములు ఏమైనా ఉన్నట్లయితే ఈ ప్రకటన ప్రచురించబడిన 30 రోజుల లోపు తెలుపవలసినదిగా కోరడమైనది. పైన పేర్కొనబడిన విధముగా సంబంధిత ప్రజలు ఎవరైనా తమ వ్రాతపూర్వకమైన సలహాలను, అభిప్రాయాలను ఈ దిగువ సంతకం చేయబడిన అధికారి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణమండలి వారికి పంపవచ్చును. సంబంధితులందరూ పైన తెలుపబడిన తేదీ, ప్రదేశమున బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలుపవచ్చును.

ప్రదేశం : కాకినాడ
తేది : 24-05-2025

సం/- పర్యావరణ ఇంజనీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కాకినాడ.